8.5.1998 శుక్రవారం 12 పేజీలు సంపుటి: 70 సంచిక: 19 విడిప్రతి రూ. 2.00లు Phone: 327354 Regd. No. HNL 18

# జమీన్‌రైతు

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు

జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

ఇల్లేకదా స్వర్గసీమ
చిరుస్వప్నాల కరుడీసిక రహస్యం
బాబానగర్‌లో ఇంటి స్థలం



* 10% తగ్గింపు కలదు.
* L.P. No. 79/97

RVR ESTATES

బాబానగర్
R. V. R. ఎస్టేట్స్
327365

ఉద్యోగం పురుష లక్షణమైతే ! సొంత ఇల్లేకదా గృహిణి లక్ష్యం !!

KALYANI ADS, NLR.

# వైఎస్ రాకతో కాంగ్రెస్‌కు కొత్త వూపిరి!

## తెలుగుదేశంపై ఒంటికాలితో వెళ్లేతత్వం కావడంతో ఇక రాష్ట్ర రాజకీయం రణరంగమే!



పిసిసి నూతన సారధిగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నియామకం - రాష్ట్ర కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపుతూంది. అసెంబ్లీ ఎన్నికలు ఒకటిన్నర ఏడాది గడువులోనే జరుగ నుండడంతో పిసిసి మార్పుకు ఎంతో ప్రాధాన్యత లభించింది. సోనియాగాంధీ ఏఐసిసి అధ్యక్షురాలైన తర్వాత రాష్ట్ర రాజకీయాలకు సంబంధించి తీసుకున్న కీలకమైన తొలి నిర్ణయం ఇదే కావడం కూడా ఈ నియామకం ప్రాముఖ్యతను పెంచింది.

రాజశేఖరరెడ్డి జీవితంలోనూ చాలా ఆసక్తికరమైన, ఆశావహమైన పరిణామం ఇది. రాష్ట్ర స్థాయి నాయకుడిగా తనకంటూ ఒక గుర్తింపును, గౌరవాన్ని, వర్గాన్ని ఎప్పుడో సంపాదించు కున్నప్పటికీ - ఆ స్థాయిలో పదవీ బాధ్యత నిర్వహించే అవకాశం మాత్రం కలుగలేదాయనకు. 1985 అసెంబ్లీ ఎన్నికలనాడే పిసిసి అధ్యక్షుడుగా పనిచేసినా - అప్పట్లో రాజకీయ పరిస్థితులు వేరు. రాష్ట్రంలో ఎన్‌టిఆర్ ప్రభంజనం వుధృతంగా

**సర్వామోదం విచిత్రం - విశేషం కూడా!**

వీస్తున్న రోజులవి. రామారావు గారు నాదెండ్ల వెన్నుపోటు నుంచి కోలుకొని, అపూర్వమైన ప్రజా మద్దతుతో విజయగర్వంతో విర్రవీగుతుండిన సమయమది. ఆ పరిస్థితులలో కాంగ్రెస్ గెలవడం, ఎటూ అసాధ్యమనే అభిప్రాయంతో సాంప్రదాయ రాజకీయ నాయకులను ప్రక్కనపెట్టి, ముక్కు ముఖం తెలియని కుర్రకారు అభ్యర్థులను రంగంలోకి దింపితే ఎట్లా వుంటుందో చూద్దామనే వుత్సకతతో అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ రాజశేఖరరెడ్డి ద్వారా నూతన రాజకీయ ప్రయోగం చేయించాడు. అనుకున్నట్లే ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దారుణమైన ఓటమి చవిచూచింది. ఆ పరిణామాలలో రాజశేఖరరెడ్డి బలిపశువై పోయాడు. టిక్కెట్లు రాని నేతలందరూ ఆయన్నే తప్పు పట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా శత్రుత్వం పెరిగింది. అందువల్ల అప్పటి పిసిసి నేతృత్వం ఆయనకు నష్టం తప్ప, మేలేమీ చేయలేదు.

తొరవ 11 పేజీలో

## ANJANA MULTI SPECIALITY DENTAL CLINIC

41, UNNAMALAI AMMAL STREET
NORTH USMAN ROAD, T.NAGAR
MADRAS-17. Ph: 8212802

10.5.98 తేది ప్రారంభం సమయం ఉ. 10.05 నిలకు

ప్రారంభకులు:
శ్రీ మాగుంట శ్రీనివాసులురెడ్డి
ఒంగోలు పార్లమెంటు సభ్యులు

ఛాంబర్ ప్రారంభకులు:
ప్రొఫెసర్ సి.ఎం.కె. రెడ్డి
FRCS, FASH (Eng.), FICS, FICA (U.S.A.)

ముఖ్య అతిథి:
డా. సి.ఆర్. రామచంద్రన్, B.Sc.,M.D.S.
ప్రొఫెసర్ : అన్నామలై యూనివర్శిటీ

SPECIALITIES AVAILABLE

* Computerised Cosmetic Dentistry
* Dental Implantology
* Maxillo Facial Prosthodontics
* Orthodontics
* Endodontics



అందరికే ఇదే మా హృదయ పూర్వక ఆహ్వానం



Dr. Prasad Reddy. E,
M.D.S.
DENTAL SURGEON & PROSTHODONTIST
Lecturer : Dept. of Prosthodontics
Meenakshi Ammal Dental College & Hospital

Best Compliments from:
డాక్టర్ జి. కొండారెడ్డి
B.D.S.
దంత వైద్య నిపుణులు, నెల్లూరు, ఫోన్: 327235

Shanti Ads, Nr, Ph: 330873

# మైపాడు విశ్వేశ్వరుడ్ని తెలుగు బందిపోట్లు నిలువుదోపిడీ చేశారు!

మైపాడు, శ్రీ ప్రసన్న విశ్వేశ్వర స్వామి దేవాలయానికి సంబంధించిన 73 ఎకరాల భూమి విక్రయంలో ఇందుకూరుపేట తెలుగు నేతలు జోక్యం చేసుకొని, దేవుడ్ని నిలువు దోపిడీ చేసినట్లు ఆరోపణ విన్పడుతూంది.

**అధికారుల అండతో ముప్పాతిక కోటి ఆస్తిని కారుచౌకగా వేలం పాడేశారు; కలెక్టర్ గారూ ఈ దోపిడీని నివారించండి!**

మైపాడులో పురాతనమైన, ప్రసిద్ధమైన దేవాలయం ఇది. ఆస్తిపాస్తులు దండిగా వున్నాయి. గంగపట్నం మజరా గ్రామమైన కాలువమూల కండ్రిగలో 73 ఎకరాల 67 సెంట్ల భూమి వుంది. ఇప్పటి వరకు దీన్ని స్థానిక కౌలుదార్లు సాగుచేస్తున్నారు. అయితే ఆ ప్రాంతంలో సముద్రం నీరు భూగర్భ జలంలోనికి చొచ్చుకొని రావడంతో పంటలు పండడం మానేశాయి. కౌలు చెల్లింపులు సరిగా జరగడం లేదు. ఈ దృష్టితో ఈ భూమిని అమ్మకానికి పెట్టేందుకు అనుమతించింది - దేవాదాయశాఖ.

భూగర్భజలం ఉప్పు నీటిమయం కావడం వల్ల పంటలు పండడం మానేశాయి కాని - అదే లవణ కాలుష్యం రొయ్యల పెంపకానికి అత్యంత అనువైన భూమిగా మార్చింది. సముద్ర జలాలతో పెంచే రొయ్యలు వైరస్‌కు గురౌతుండడంతో, అధిక శాతం రైతులు ఇప్పుడు తక్కువ ఉప్పు సాంద్రత కల్గిన నీరు లభించే భూములలో రొయ్యల పెంపకం చేపడుతున్నారు. అవి విజయవంతం అవుతుండడంతో ఒకేసారిగా ఆ తరహా భూములకు విలువ అమాంతం పెరిగిపోయింది. ఎకరాకు 20 నుంచి 25వేల రూపాయల వరకు లీజు చెల్లించడానికి కూడా రైతులు సిద్ధపడుతున్నారు.

విశ్వేశ్వరస్వామి భూములు ఈ కోవకు చెందినవి. ఇందులో రొయ్యల పంట నమ్మకంగా పండించు కోవచ్చునన్న ఆశ రైతులకు కల్గింది. అయితే అదే సమయంలో కొందరు తెలుగు నాయకులకు వీటిపై కన్ను పడింది. అధికారం వారి చేతులోనే వుందికదా - గోల్మాల్ చేసి ఆ పొలమంతటినీ తమ పరం చేసుకోవడానికి సర్వ సన్నాహాలు చేస్కున్నారు. దేవాలయం అధికారులూ

కొరవ 11వ పేజీలో



గుళ్లపల్లి సత్యనారాయణ కుమార్తె సరస్వతి, వెంకటభాస్కర బదరీనాథ్ వివాహం 30వ తేదీ టిటిడిలో జరిగింది.

# కొత్తరైళ్లు వేయరు - కాని కొత్త ఛార్జీలు మాత్రం వడ్డిస్తారు!

రైల్వే బడ్జెట్ విషయంలోనూ ప్రజలకు నిరాశే ఎదురౌతుందన్నది అంచనా. కొత్త రైల్వే బడ్జెట్‌లో అన్ని రకాల ఛార్జీలూ పెరిగే సూచనలు కన్పిస్తున్నాయి.

రైల్వే మంత్రి తీసుకున్న ఒక ముఖ్యమైన నిర్ణయం - ఇప్పట్లో కొత్త రైళ్లు వేటినీ ప్రవేశపెట్టకుండా నిలపడం. ఒక కొత్త ప్యాసింజర్ రైలు నడపాలంటే కనీసం రెండు గూడ్సు రైళ్లను తగ్గించ వలసి వస్తున్నదట. రైల్వే శాఖకు ప్యాసింజర్ టిక్కెట్లపై కంటే సరకు రవాణా ఛార్జీల ద్వారానే అధిక ఆదాయం లభిస్తున్నది. అందువల్ల

**రైల్వే బడ్జెట్ నిరుత్సాహం కల్గించ బోతూంది!**

రాజకీయవాదుల ఒత్తిడికి లొంగి కొత్త రైళ్లు ప్రవేశపెట్టడం కంటే దూర ప్రాంతం వెళ్లే రైళ్లకు అదనపు బోగీలు తగిలించడం సరైన పద్ధతని రైల్వే మంత్రి భావిస్తున్నారు. దీనివల్ల ప్రయాణీకుల రద్దీని తగ్గించ వచ్చు; ఖర్చు తగ్గించు కోవచ్చు. ప్లాట్‌ఫారం పొడవును పెంచితే చాలు - ఈసారి రైల్వే బడ్జెట్‌లో జరగబోయే ప్రధాన మార్పు - రేషన్ షాపుల ద్వారా పంపిణీ అయ్యే ఆహార ధాన్యాలకు; కిరోసిన్‌కు ఇస్తున్న రవాణా సబ్సిడీని రద్దు చేయడం. ఈ సంక్షేమ కార్యక్రమం కోసం రైల్వేలు కొన్ని వందల కోట్లు వ్యయం చేస్తున్నాయి. వాటిని తగ్గించి, ఆమేర స్టీలు, సిమెంట్ రవాణాకు రాయితీ ఇస్తే పారిశ్రామికులకు సౌకర్యంగా వుంటుందని భావిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం రైల్వే రవాణా ఛార్జీలు పెంచినప్పటి నుంచి పారిశ్రామిక వేత్తలు రైల్వేలను వదలి తమ రవాణా అవసరాల కోసం లారీల మీద ఆధారపడ్తున్నారు. అందువల్ల పరిశ్రమల కవసరమయ్యే సరకుల రవాణా ఛార్జీలు తగ్గించ వచ్చు. రేట్లు అధికం కావడం వల్లనే 450 మిలియన్ టన్నుల సరకు రవాణా లక్ష్యం నెరవేరలేదు. కేవలం 430 మిలియన్ టన్నుల సరకులు మాత్రమే రైల్వేల ద్వారా రవాణా అయ్యాయి. రవాణా పెరిగితేనే రైల్వేలకు ఆదాయం పెరుగుతుంది. అందువల్ల ఈ కోణం నుంచి బడ్జెట్ కసరత్తులు చేస్తున్నాడు రైల్వే మంత్రి. *





క్రీడా హాస్టల్ ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న కలెక్టర్ శ్రీలక్ష్మి, వేదికపై మంత్రి చంద్రమోహన్ రెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి వున్నారు

# మిత్రపక్షాల గొంతెమ్మ కోర్కెలతో ఆర్థిక మంత్రికి పీడకలలు!

బిజెపి ప్రభుత్వం త్వరలో ప్రవేశ పెట్టనున్న కేంద్ర బడ్జెట్ స్వరూప స్వభావాల గురించి ప్రజలలో చాలా ఆసక్తి రేకెత్తుతూంది. వివిధ మిత్ర పక్షాల నుంచి వస్తున్న వత్తిడులను భరించి, వారినందరినీ సంతృప్తి పరుస్తూ బడ్జెట్ తయారు చేయడం అంత సులువైన పని కాదు. ఆర్థికమంత్రి యశ్వంత్ సిన్హాకు అది ముళ్లబాట మీద నడక క్రిందే లెక్క.

అసలే కేంద్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగాలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ విపరీతమైన ఒడిదుడుకులకు లోనౌతుండడంతో కేంద్ర ఖజానా సైతం వట్టి పోయివుంది. ద్రవ్య లోటు అపరిమితం. ప్రభుత్వ ఉద్యోగులకు ఇటీవల జీతాలు విపరీతంగా పెంచడం, పబ్లిక్ సెక్టార్ కంపెనీల నష్టాలు, వివిధ వర్గాలకు ఇస్తున్న సబ్సిడీలు ప్రభుత్వానికి తలకు మించిన భారమౌతున్నాయి. 1991లో ద్రవ్యలోటు 48శాతం వుంటే ఇప్పుడది 78 శాతానికి పెరిగింది. అప్పులపై వడ్డీ చెల్లింపులు 20 నుండి 29 శాతం వరకు; ఉద్యోగుల జీతభత్యాల ఖర్చు 17 నుంచి 30 శాతానికి పెరిగాయి. మొత్తం బడ్జెట్‌లో రక్షణ శాఖ వ్యయం 15 శాతం పైగా వుంది. పాకిస్తాన్ నుంచి సైనిక పరంగా ఎదురౌతున్న సవాళ్ల దృష్ట్యా దాన్ని తగ్గించే సాహసం చేయలేము. ఈ పరిణామాలన్నీ బడ్జెట్‌పై ప్రభావం చూపుతాయి.

**కేంద్ర బడ్జెట్ రూపకల్పనలో బిజెపి ప్రభుత్వం సంకట స్థితిని ఎదుర్కొంటూంది; చెప్పినదేదీ చేయలేని స్థితిలో పడిపోయింది!**

కేంద్ర ప్రభుత్వానికి వచ్చే రెవిన్యూ ఆదాయంతో సమాన స్థాయిలో మాత్రమే మొత్తం వ్యయం వుండేటట్లు చేయగల్గితేనే ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా వుంటుంది. ఆదాయం కంటే వ్యయం పెరిగి పోవడంతో, ఆ లోటు పూడ్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అప్పులు చేయవలసి వస్తుంది. ఉద్యోగులకు జీతాలు, అప్పులకు వడ్డీల కోసం కొత్త అప్పులు చేయవలసి రావడమే ఇప్పటి అనర్థాలకు కారణం. రోడ్లు వేయడానికి, పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి అప్పులు చేస్తే వాటి ద్వారా అదనపు ఉత్పత్తి, సంపద, ఆదాయం చేకూరుతాయి. కాబట్టి అప్పు చెల్లించడం వీలౌతుంది. వడ్డీల కోసం అప్పులు చేస్తే వాటిని తీర్చడానికి మళ్లీ అప్పులు చేయవలసి వస్తుంది. అదొక విషవలయం. ఈనాడు దేశంలో ద్రవ్యలోటు పెరిగి పోవడానికి కారణమదే!

ఈ సమస్యలు చాలవన్నట్లు బిజెపి మిత్రపక్షాలు ఆర్థిక మంత్రిని గొంతెమ్మ కోరికలు కోరుతున్నాయి. జయలలిత తమిళనాడు రాష్ట్రానికి వేలకోట్లు ఇవ్వమని వత్తిడి చేస్తున్నది. చంద్రబాబు నాయుడు - పంజాబ్ వలె ఆంధ్రలోనూ కేంద్రం ఇచ్చిన అప్పులు రద్దు చేయమని అడుగు తున్నారు. వాటి మొత్తం 6వేల కోట్లపైమాటే! మమతా బెనర్జీ పశ్చిమబెంగాల్‌కు ప్రత్యేక ప్యాకేజి కావాలని అభ్యర్థిస్తున్నది. ఒరిస్సా పట్నాయక్ కోరికా అదే! తమిళనాడు రాష్ట్రంలో పంచే సబ్సిడీ బియ్యం ఖర్చు సమస్తం కేంద్రం భరించాలన్నది జయలలిత అభిలాష వీరిలో ఎవరినీ నొప్పించే పరిస్థితిలో లేదు బిజెపి ప్రభుత్వం. ఎవరు అలిగినా ప్రభుత్వానికే ప్రమాదం.

ఇంకొక ప్రశ్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఏటా కేటాయించే 50 నుంచి 60 వేల కోట్ల రూపాయల విషయం ఆర్థికమంత్రి ఏమి చేయనున్నాడో నన్నది ఒక ప్రశ్న. ఈ నిధుల కోసం సాంప్రదాయకంగా విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం అలవాటు. స్వదేశీ విధానం గురించి మాట్లాడుతూ విదేశీ పెట్టుబడుల మీద ఆధారపడడం ఎంత వరకు సమంజసం. అవి వద్దనుకొంటే, ఈ రంగాలకు నిధులెక్కడి నుండి వస్తాయి?

కొత్తగా అధికారంలోకి వచ్చారు కాబట్టి ప్రజలను ఆకర్షించడానికి పాపులర్ పథకాలేవైనా ప్రకటించాలి. కాని ఆర్థికమంత్రికి ఆ వసతి లభించడం లేదు. అభివృద్ధికి కీలకాలైన మౌలిక వనరుల కల్పనకు, పవర్ వంటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇవ్వక తప్పదు. మొత్తం ప్రణాళికా వ్యయంలో 60శాతం వ్యవసాయానికి కేటాయిస్తామని ముందే

కొరవ 7వ పేజీలో

# ఫెర్నాండెజ్ పైత్యం

రక్షణ మంత్రి జార్జి ఫెర్నాండెజ్ చైనా గురించి పదే పదే చేస్తున్న ప్రకటనలు అంతర్జాతీయ సంబంధాల నిర్వహణలో బిజెపి ప్రభుత్వ శైలిని ప్రశ్నార్థకంలో పెడుతున్నాయి. తాను ప్రతిపక్ష నేతను కాదని, బాధ్యత కల్గిన రక్షణ మంత్రి పదవిలో వున్నానని మర్చిపోయి నట్లున్నాడు ఫెర్నాండెజ్. దేశంలో రాజకీయ ప్రత్యర్థుల మీద అభాండాలు వేసినంత సులువుగా, పొరుగు రాజ్యాలపైన నిందలు క్రుమ్మరిస్తున్నా రాయన. పత్రికల వాళ్లు కన్పడితే పూనకం పట్టినట్లు ప్రవర్తించడం ప్రతిపక్ష నేతలకు అలవాటు; ప్రభుత్వలో చేరినా ఆ ప్రచార వ్యామోహం వదలుతున్నట్లు లేదు - ఫెర్నాండెజ్‌ను!

భారతదేశం భద్రతకు పాకిస్తాన్ కంటే అధికంగా, చైనా నుంచి పెను ముప్పు ఎదురయ్యే ప్రమాదం కన్పిస్తుందన్నది ఫెర్నాండెజ్ చేసిన ప్రథమ ఆరోపణ. ఇందుకు మద్దతుగా ఆయన - చైనా సైన్యం అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దుల్లోకి చొచ్చుకొని వచ్చి, ఒక హెలిప్యాడ్ నిర్మించిందని ప్రకటించారు. ఆ తర్వాత మరొక ప్రకటన చేస్తూ - అండమాన్ దీవుల సమీపంలో భారత రక్షణకు ప్రమాదం కల్పించే రీతిలో చైనా నావికాదళం ఒక ఎలక్ట్రానిక్ గూఢచారి వ్యవస్థ నెలకొల్పిందని; త్వరలో నావికాదళ కేంద్రం స్థాపించనున్నదని చెప్పారు.

దేశ సరిహద్దుల్లో శత్రుసైన్యం చొచ్చుకొని వస్తుందని దేశ రక్షణ మంత్రి చెప్తే ప్రజలు నమ్మాలా? వద్దా? సరిహద్దు సమాచారం సైన్యానికి తెలిసినంత సమగ్రంగా, నిర్దిష్టంగా మరే ప్రభుత్వ విభాగానికీ తెలియదు; ఫెర్నాండెజ్ ఆ సైన్యానికి అధిపతి. అంత బాధ్యతాయుత పదవిలో వుంటూ ఆయన ఆకతాయి ప్రకటనలకు, ఉబుసుపోక ప్రచారాలకు పాల్పడ తారని భావించగలమా? అందులోనూ ఫెర్నాండెజ్ వంటి అభ్యుదయ భావాలు కల్గిన మేధావి?

దురదృష్టవశాత్తు ఫెర్నాండెజ్ అటువంటి పిల్లచేష్టలకే పాల్పడు తున్నారు. అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దుల్లో చైనా హెలిపాడ్ వార్త పూర్తిగా నిరాధారమని సాక్షాత్తు ప్రధానమంత్రి వాజ్‌పేయి ప్రకటించారు. అండమాన్ దీవుల్లో చైనా సైన్యం కదలికలేవీ లేవని; ఫెర్నాండెజ్ చెప్పినట్లుగా అక్కడ ఏ దీవినీ బర్మా నుంచి చైనా లీజుకు తీసుకోనేలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. చైనా ప్రభుత్వం సైతం ఈ రెండు సమాచారాలూ అసత్యమని ఖండించింది. అయినప్పటికీ ఫెర్నాండెజ్ పైత్యం సద్దుమణగలేదు. చైనా నుంచి భారత దేశానికి రక్షణ ప్రమాదం వుందన్న తన అభిప్రాయంలో మార్పు లేదని, తాను నిజమే చెప్తున్నానని మరొకసారి ప్రకటించా రాయన.

ఏమిటీ అర్థం లేని వాగుడు? ముప్పయ్యారేళ్ల క్రితం భారత - చైనా యుద్ధం జరిగినప్పటి నుంచి రెండు దేశాల మధ్య పూర్తిస్థాయి స్నేహ సౌహార్ద్ర భావాలు ఏర్పడనే లేదు. చైనా చేతిలో ఎదురైన ఓటమి పరాభవంతోనే జవహర్‌లాల్ నెహ్రూ మనోవ్యాధితో మరణించారన్నది నమ్మదగిన వాదం. అనాడు చైనా ఆక్రమించిన 35వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగం ఇప్పటికీ మనకు వెనక్కి తిరిగి రాలేదు. రెండు దేశాల మధ్య వాస్తవాధీన రేఖ వివాదం అట్నే వుంది. టిబెట్ విషయంలో భారతదేశం పట్ల చైనాకు అసంతృప్తి వుంది. దలైలామాకు మనం ఆశ్రయం ఇవ్వడం అందుకు కారణం. రాజీవ్‌గాంధీ మినహా భారత ప్రభుత్వ నేతలెవరూ చైనాను సందర్శించలేదు. 1976 నుంచి దౌత్య సంబంధాలు వున్నప్పటికీ చైనాను మిత్ర దేశంగా పరిగణించే పరిస్థితులు నెలకొనలేదు. 1962 నాటి యుద్ధమే కాక - రష్యాతో మనమిత్ర బంధం, చైనాతో రష్యా వైరం ఈ ఎడబాటుకు మరొక కారణం.

ఈ చారిత్రక నేపథ్యంలో, మారిన అంతర్జాతీయ పరిస్థితులలో చైనాతో వ్యవహారం అత్యంత సున్నితమైనదిగా భావించాలి. రష్యా పతనం తర్వాత, ప్రపంచంలో ఏకైక కమ్యూనిస్టు రాజ్యంగా మిగిలింది చైనా; ఇంకొక ప్రక్క క్యాపిటలిస్ట్ అమెరికా సహకారంతో అత్యంత శీఘ్రంగా ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నది. రానున్న పదేళ్లలో ఆసియా ఖండంలో బలవత్తర అగ్రరాజ్యంగా స్థిరపడబో తూందది. వారి సైనికశక్తి, సాంకేతిక పరిజ్ఞానం అపారం; అందుకు ఆర్థిక సంపత్తి తోడవు తున్నదిప్పుడు.

ఈ పరిస్థితులలో చైనాతో వైరం మనకే మాత్రం సమంజసం కాదు. భారత్, చైనాలు కలిసి వుంటే ప్రపంచ రాజకీయాలలో అమెరికా, యూరప్ దేశాలతో సమవుజ్జీలుగా వ్యవహరించ వచ్చు.

ఇవన్నీ తెలిసీ ఫెర్నాండెజ్ ఎందుకు చైనాతో వైరం రెచ్చగొడు తున్నారో అర్థం కాని విషయం. చైనా నుంచి ముప్పు వుందన్న వూహ

## జమీన్‌రైతు

ఆయనకు ఎందుకు కల్గిందో అంతుపట్టడం లేదు. అదే నిజమైతే అందుకు ధీటుగా సైనిక పాటవాన్ని సరిహద్దుల్లో మొహరింప చేయాలేతప్ప, పత్రికలకెక్కి రచ్చచేసి ప్రయోజనం ఏమిటి? అంతర్జాతీయ రాజకీయాలు చాలా సున్నితమైనవి. కార్మిక నాయకుడిగా ఫ్యాక్టరీ యాజమాన్యాలతో వలె దూకుడుతనం ప్రదర్శిస్తే దేశం చాలా నష్టపోతుంది. ఇప్పుడు మనకు కావలసింది రెచ్చగొట్టే ప్రసంగాలు, ప్రకటనలు కాదు; ఇరుగు పొరుగు దేశాలతో శాంతి. చైనాతో ఆర్థిక, దౌత్య, రాజకీయ సహకారం పొందగల్గితేనే ఆసియాఖండంలో శాంతి నిలుస్తుంది. ఉభయ దేశాల ప్రజలకు అది ఎంతో అవసరం. ఫెర్నాండెజ్ వంటి నోటి దురుసుతనం కల్గిన వ్యక్తులను రక్షణ మంత్రి వంటి కీలక పదవులలో కొనసాగించడం దేశ శ్రేయస్సుకు ఏమాత్రం ఉపకారి కాదు. ప్రధాని వాజ్‌పేయి తక్షణం ఫెర్నాండెజ్ ప్రేలాపనలకు బ్రేకులు వేయాలి; అది వీలు కాకుంటే ఆయన్ను ఆ పదవి నుంచి తప్పించాలి. ఒక రాజకీయ వాది ప్రచార వ్యామోహం వల్ల, ఆకతాయి తనం వల్ల చైనా వంటి బలవత్తర దేశంతో శత్రుత్వం కొనితెచ్చుకొనే పరిస్థితిలో మనం లేము. అది ఉభయ దేశాల భవిష్యత్తుకు వినాశనం తప్ప, మేలు చేయదు. చైనాతో మనకు వున్న సమస్యలను పరిష్కరించు కోవడానికి పలు రకాల దౌత్య మార్గాలు వున్నాయి. గత పదేళ్లలో రెండు దేశాల మధ్య సంబంధాలు ఎంతో మెరుగౌతున్నాయి. ఇటీవలనే చైనా సర్వ సైన్యాధికారి సైతం ఇండియా వచ్చి వెళ్లారు. వారికి మన పట్ల పెరుగుతున్న విశ్వాసానికి అది ప్రతీక. ఈ పరస్పర విశ్వాసాన్ని, సహకార భావాన్ని మరింత పెంచడం ప్రభుత్వ కర్తవ్యం. ప్రభుత్వంలోని ప్రతి మంత్రీ ఆ దిశలో వ్యవహరించాలే తప్ప - తమ వ్యక్తిగత అభిమాన, దురభిమానాలతో అంతర్జాతీయ సంబంధాలను కలుషితం చేయ కూడదు. ఫెర్నాండెజ్ నోటికి తక్షణం తాళం వేయించడం వాజ్‌పేయి బాధ్యత.

* * *

## జమీన్‌రైతు

తేది:7.5.48

వెల:0-2-0 పేజీలు:12

### ఏడవ ఆంధ్రరాష్ట్ర జమీన్‌రైతు మహాసభ

ఆచార్య రంగాగారి ప్రారంభ వాక్యాలతో, వాగిచేని వెంకయ్య గారి అధ్యక్షతన విజయవంతమైన సభలో - జమీన్‌రైతు వుద్యమము.

1929లో జమీన్‌రైతు వుద్యమాన్ని ప్రారంభించి జమీన్‌దారీ విధానము రద్దు చేయుటకు ఆదర్శముగ చేసిన శ్రీ రంగాగారిని, శ్రీ వెంకట్రామా నాయుడు గారిని శ్రీ మండేశ్వర శర్మగారిని శ్రీ విశ్వనాథ రామగారిని 1931 సంవత్సర ప్రథమ ఆంధ్రరాష్ట్ర జమీన్‌రైతు మహాసభను (వెంకటగిరి) ఈ సమయంలో స్మరించ వలసి వున్నది. వుద్యమ నిర్వాహకులుగా నేటికీ శ్రీ రంగాగారు, వెంకట్రామా నాయుడుగారలు ఉన్నందున వారికి మన జోహారు లర్పించవలసి యున్నది. 1930 సంవత్సరం మొదలుకొని శ్రీ వెంకట్రామా నాయుడుగారు సంపాదకులుగ ప్రారంభించి నిరంతరాయంగ ఎన్నికష్టము లర్చుకొన్నా లక్ష్యము చేయని జమీన్‌రైతు పత్రికకు మన కృతజ్ఞతలు.

### మైకా పరిశ్రమ

ఎక్కువ మందికి అందుబాటులో వుండులాగున కొన్ని లిమిటెడ్ కంపెనీలు స్థాపించి భారీ ఎత్తున పరిశ్రమ సాగిస్తే నెల్లూరు మైకా పరిశ్రమ భవిష్యత్తులో హిందూ దేశమంతటిని అగ్రస్థానమలంకరించగలదు - మరుపూరు పిచ్చిరెడ్డి

### గ్రంథసమీక్ష

రచయిత - ఉండేల మాలకొండా రెడ్డి గారు, అల్లూరు, వెల 1-00

ఇది భారత స్వాతంత్ర్య పోరాటంలో మహోజ్వలంగా వెలిగిన సుభాష్

**50 ఏళ్లక్రితం ఈ వారం**

చంద్రబోసు వీరగాథ. సుభాష్ చంద్రుని గురించి సమగ్రమైన స్వరూప మిచ్చాడీ కవి కుమారుడు. ఈ అబ్బాయి వయస్సు 16 రెండ్లని విన్న తర్వాత ఆశ్చర్యం వేయకమానదు - భావ మీద యితని ప్రభావం అనంతమైంది - జాషువా గారి గుబ్బపు కదనువంటి శైలి, పోతనగారి మాధుర్యం, కవి కోకిల దువ్వూరి రామిరెడ్డి గారి కమ్మదనం కలసి మాలకొండారెడ్డి గారి కవితావాహిలో ప్రవహించి వన్నెలు కూర్చినది - యీ అబ్బాయి రెండో రచన కోసం ఎదురు చూస్తున్నాం.-శిరి

### గూడూరు సంగతులు

#### జపాన్‌యాత్ర

మైకా వ్యాపారం మీద మన

తరువ 10 పేజీలో

# పలుకుబడి వుంటేనే ప్రభుత్వ అవార్డులా?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్నమయ్య చిత్రానికి నంది అవార్డును ప్రదానం చేసింది. ఈ చిత్రంలో నటించిన నాగార్జునను ఉత్తమ నటుడిగా ఎంపిక చేశారు. అయితే లోగడ ఏసుక్రీస్తు, షిర్డిసాయిబాబాలు మన మధ్యనే ఉన్నారా అన్నట్లు, ఈ రెండు పాత్రలు అపు రూపంగా పోషించిన విజయచందర్‌కు ఎటువంటి అవార్డులూ రాలేదు. దయామయుడు, షిర్డిసాయిబాబా మహత్యం చిత్రాలకు నంది అవార్డుల కమిటీ సభ్యులు చిన్నపాటి ప్రశంస కూడా కురిపించలేదు. నంది అవార్డులకు ఎంపిక చేస్తున్న చిత్రాలకు నటీ, నటుల ప్రతిభతోపాటు, పలుకుబడి కూడా ఉండాలని కమిటీ సభ్యులు ప్రతిసారి చాటి చెబుతున్నారు.

బెంగుళూరు ఎ.ఆర్. రావు

### ప్రజా ప్రతినిధులకు శిక్షణా తరగతులు

చట్ట సభల్లో కార్యక్రమాలు సజావుగా జరగడమే లేదు. లోకసభ, రాజ్యసభ, వివిధ రాష్ట్రాల అసెంబ్లీలలో నిర్మాణాత్మకమైన చర్చలకు తరచూ విఘాత మేర్పడుతోంది. ఎక్కువ శాతం మంది ప్రజా ప్రతినిధులకు పార్లమెంటరీ పద్ధతులపై అవగాహన లేకుండా పోయింది. ఏదో ఒక అంశాన్ని తీసుకొని నానా రభస సృష్టిస్తున్నారు. సభ వాయిదా పడేలా చూస్తున్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు జరిగిన 150 గంటల్లో 30 గంటల సమయం అనవసర రభసకు వృధా అయిపోయింది. దీనివల్ల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగ మయ్యింది. సభల్లో జరిగే చర్చలను టివిలోనేరుగా ప్రసారం చేయడం

## జనవాణి

వల్ల ప్రజా ప్రతినిధులు మారుతారని ఒక ఆశవుండింది. అది దురాశగానే మిగిలి పోయిందనాలి. చట్ట సభలకు ఎన్నికవు తున్న నాయకులకు, ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించి వారి పని తీరును మెరుగుపర్చాలి.

నెల్లూరు వి. సుధాకరరావు

### పోలీస్ శాఖను సంస్కరించాలి

పోలీసులు ఎంతో కష్టపడి తమ బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు 'జమీన్‌రైతు జనవాణి' శీర్షికలో ఇటీవల ప్రచురితమైన ఒక ఉత్తరం చదివాను. కాని రాష్ట్ర పోలీసులు అంత నిజాయితీగా తమ డ్యూటీలు చేయడం లేదు. ఆ విధంగా చేస్తుంటే రాష్ట్రంలోని జైళ్ల నుంచి అంత మంది ఖైదీలు తప్పించు కొనేవారు కాదు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో మహిళల మానభంగాలు, మాజీ నక్సలైట్‌పై సివిల్ పోలీసుల అత్యాచారం, పాత బస్తీలో ఒక వ్యక్తి సజీవ దహనం, లెక్కలేనన్ని

తరువ 10వ పేజీలో

అన్ని సూటింగ్స్, షర్టింగ్స్
జెంట్స్ రెడీమేడ్స్‌పై
20% డిస్కౌంట్
(క్యాష్ డిస్కౌంట్)
కొద్దిరోజులు మాత్రమే
రూ.250లకు విమల్ వస్త్రములు కొని కూపన్ పొందండి. 60లక్షల రూపాయల బహుమతులు గెల్చుకోండి.
ఈ అవకాశం 31.5.98 వరకు మాత్రమే!
విమల్ జంక్షన్
కాపువీధి, నెల్లూరు -1, ఫోన్: 325420

# నెల్లూరు కామ్రేడ్లు మేడే ఘనంగా జరిపారు!

తెలుగుదేశం పార్టీతో తెగతెంపులు చేసుకొన్న తర్వాత, తమ పార్టీ ఉనికిని పెద్దగా చాటాలని భావించారేమో, నెల్లూరు సిపిఎం నేతలు 'మేడే' వేడుకలను ఘనంగా జరిపారు. కొన్ని సెంటర్లకు మాత్రమే పరిమితమయ్యే ఈ కార్యక్రమం ఈసారి టౌనంతా విస్తరించింది. ఆత్మకూరు బస్టాండ్ మొదలుకొని అయ్యప్పగుడి వరకు రోడ్డుపై ఎటుచూసినా ఎర్రరంగు తోరణాలు కనిపించాయి. ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట, కనకమహల్ సెంటర్,

## నెల్లూరుసంగతులు

గాంధీబొమ్మ, నెహ్రూ బొమ్మ, ఆర్టీసి బస్టాండ్, చిన్నబజారు ప్రాంతాల్లో సిపిఎం కార్మిక నాయకులు పతాకావిష్కరణలు చేశారు. మద్రాస్ బస్టాండ్ వద్ద నెహ్రూ విగ్రహం ముందు ఎసి కూరగాయల మార్కెట్ కార్మికులు, వ్యాపారస్తులు కలసి అత్యంత శ్రద్ధతో ఏర్పాటు చేసిన ప్రపంచ కార్మిక విగ్రహం మళ్లీ మళ్లీ చూడాలనిపించింది. మేడే సందర్భంగా ప్రతి యేడాదీ జిల్లాలోని పార్టీ కార్యకర్తలతో సిపిఎం ఒక ప్రదర్శనను నిర్వహించేది. ఈ యేడాది ఆ ప్రదర్శన కొందరు కార్మికులతో 'తూతూ మంత్రం'గా నిర్వహించి సరిపెట్టుకొన్నారు. కారణ మేమిటో!

### ఉపవిద్యాశాఖాధికారికి సన్మానం!

జిల్లా ఉప విద్యాశాఖాధికారిగా పదవీ విరమణ చేసిన ఆర్. నాగేశ్వరరావును నెల్లూరు టౌన్‌లోని ఇంగ్లీషు మీడియం స్కూల్స్ అసోసియేషన్ 1తేది ఘనంగా సన్మానించింది. కస్తూరిదేవి స్కూల్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో బియిడి కాలేజి ప్రిన్సిపల్ భీమన్న, డిఇఓ సుదర్శనవర్మ, స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు చాట్లనరసింహారావు, మోసెస్ తదితరులు పాల్గొని నాగేశ్వరరావు గుణ, గణాలు ప్రస్తుతించారు.

### డ్రాయింగ్‌లో ఉచిత శిక్షణ

సింహపురి ఫైన్ ఆర్ట్స్ అకాడెమి వేసవి సెలవుల్లో టౌన్‌లోని పిల్లలకు డ్రాయింగ్, పెయింటింగ్‌లలో ఉచిత శిక్షణ ఇవ్వనుంది. తడికల బజారు సెంటర్‌లోని నెహ్రూ బాలభవన్‌లో ఈ క్లాసులు ప్రతి ఆదివారం జరుగుతాయి. డ్రాయింగ్‌లో లోయర్, హయ్యర్ పరీక్షలకు హాజరయ్యే వారికి కూడా తమ సంస్థ ఉచితంగా శిక్షణ ఇస్తుందని అకాడమి కార్యదర్శి కె. రామారావు చెప్పారు.

### కండక్టర్ పోస్టులకు ఇంటర్వ్యూలు!

నెల్లూరు ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఖాళీగా వున్న కండక్టర్ పోస్టులకు ఇంటర్వ్యూలను మే 18, 19 తేదీల్లో నిర్వహించ నున్నట్లు రీజినల్ మేనేజర్ టి.వి. సుబ్బారెడ్డి చెప్పారు. 200 కండక్టర్ పోస్టులకు

కొరవ 12వ పేజీలో

# మూడురోజులకు సాగిన రొట్టెల పండుగ

మత సమైక్యతకు ప్రతీకగా నిలిచే 'రొట్టెల పండుగ' ఈ యేడాది మూడు రోజుల పాటు నెల్లూరులోని బారాషహీద్ దర్గా వద్ద జరుగనున్నది. వాస్తవానికి రొట్టెల పండుగ 9తేది ఒక్కరోజు జరగాలి. మొహరం నెల చంద్రోదయంపై కాస్త గందరగోళం రేగడం వల్లనే కాకుండా, ప్రజలకు వసతిగా కూడా ఉంటుందని దర్గా కమిటీ భావించి, మూడు రోజులపాటు (8,9,10 తేదీలలో) పండుగను నిర్వహించాలని నిశ్చయించింది. రొట్టెల పండుగలో సౌకర్యాలు కల్పించను మునిసిపాలిటీ ఈ యేడాది 1 1/2 లక్ష రూపాయలు వెచ్చించ నున్నది. 200 మంది మునిసిపల్ సిబ్బంది మంది దర్గా పరిసర ప్రాంతాలలోనే ఉండి ప్రజలకు అవసరమైన సహాయం చేస్తారు. ఇందు కోసం మునిసిపల్ కమీషనర్ కె. వెంకట్రామిరెడ్డి కన్వీనర్‌గా ఒక కమిటీని ఏర్పాటు చేశారు. మునిసిపల్ కౌన్సిలర్లు సందాని బాషా, షఫీ, ఖాజా రంతుల్లా, మునాఫ్, ఆసియాబేగం ఈ కమిటీలో సభ్యులుగా వుండి ఏర్పాటు పర్యవేక్షిస్తారు. 10 దగ్గర నీళ్లస్టాల్స్, 15 చోట్ల కొళాయిలను ఏర్పాటు చేయడంతో పాటు, మూడు నీటి ట్యాంకులను సిద్ధం చేస్తున్నారు. సాయిబాబా మందిరం, వేణుగోపాలస్వామి ఆలయం, రాజరాజేశ్వరి దేవస్థానం, హుగుంట ఛారిటబుల్ ట్రస్ట్‌లకు సంబంధించిన నీటి ట్యాంకర్లు భక్తుల సేవకు సిద్ధంగా వుంటాయి. వీటన్నింటి ఎక్కువగా విద్యుత్ దీపాలు, మహిళలకు ప్రత్యేకంగా డ్రెస్సింగ్ రూములు ఏర్పాటు చేస్తారు. మునిసిపల్ ఛైర్మన్ విహారానందరెడ్డికి ఢిల్లీ యాత్ర పైనబడడంతో ఏర్పాట్లు చూసే పనిని అధికారులకు అప్పజెప్పారాయన. వీరు ఎంత వరకు సఫలీ కృతులవుతారన్నది స్వయంగా చూసి, వచ్చే వారం చెప్తాం! *

# జన్మభూమికి ప్రజాదరణే వుంటే కోకోకోలా మాదిరి టోపీల ప్రచారమెందుకు?

ఇందిరాభవన్ 2 తేది కాంగ్రెస్ కార్యకర్తలతో కిటకిట లాడిపోయింది. డిసిసి సర్వ సభ్య సమావేశంలో బాపట్ల ఎమ్పీ నేదురుమల్లి జనార్ధన రెడ్డి, అసెంబ్లీలో కాంగ్రెస్ పక్ష నాయకుడు పి. జనార్ధన రెడ్డి కలసి పాల్గొనడంతో, ఎండను సైతం లెక్కచేయకుండా కార్యకర్తలు తరలి వచ్చారు. డిసిసి అధ్యక్షుడు సివి శేషారెడ్డి సమావేశపు హాలును కొత్త పెళ్లికూతురిలా అలంకరించి, స్టేజి వెనుక నూలు వడికే రాట్నాన్ని ప్రత్యేకంగా అమర్చడం పలువుర్ని ఆకర్షించింది. నేదురుమల్లి జనార్దనరెడ్డి కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెడితే; పి జనార్దన రెడ్డి - ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో జరుగుతున్న అవకతవకలను వివరంగా చెప్పారు. డిసిసి కార్యదర్శి ఎల్లసిరి గోపాలరెడ్డి జిల్లా నాయకులను వేదిక మీదకు ఆహ్వానించిన అనంతరం, అధ్యక్షోపన్యాసం చేశారు. చంద్రబాబు బూటకపు పాలన చేస్తున్నారు, వీధి వీధికి మద్యం షాపులు ఏర్పాటు చేసిన ఈ ఘనుడికి మహిళలు తగిన విధంగా బుద్ధి చెప్పాలన్నారు. మాజీ మంత్రి పసల పెంచలయ్య మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పలురకాలుగా రిగ్గింగ్‌కు పాల్పడబట్టి పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీకి 12 సీట్లు వచ్చినట్లు వివరించారు. ఆత్మకూరు మాజీ శాసన సభ్యుడు డాక్టర్ సుందర రామిరెడ్డి మాట్లాడుతూ ఇద్దరు జనార్ధనరెడ్లు కలసి రాష్ట్రంలో పార్టీని పటిష్ట పరచను ప్రయత్నించాలన్నారు. నెల్లూరు ఎమ్పీ పనబాక లక్ష్మి మాట్లాడుతూ ఇప్పటి నుంచే పార్టీ కార్యకర్తలు, నాయకులు కలసి పనిచేయకపోతే అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోలే మన్నారు. తెలంగాణా యాసలో పి. జనార్ధనరెడ్డి సుదీర్ఘ ఉపన్యాస మిచ్చారు. రాష్ట్రంలోనే ఎంతో రాజకీయ చైతన్యం గల నెల్లూరు జిల్లాలోని పార్టీ కార్యకర్తల ముందు మాట్లాడాలంటే ధైర్యం కూడగట్టు కోవాల్సి వస్తున్నది. అసెంబ్లీలో కాంగ్రెస్ పక్ష ఎమ్మెల్యేలు సమావేశాలను సజావుగా జరగనీయడం లేదని కొందరు విమర్శిస్తున్నారు. కాని అది కట్టుకథ; వాస్తవాలను వివరించి చెప్పబోయేసరికి స్పీకర్ మైకు కనెక్షన్ తీసివేస్తున్నారు. గత్యంతరం లేక ప్రతిరోజూ స్పీకర్ పోడియం వద్ద బైఠాయించ వలసి వస్తున్నది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్లమెంటు ఎన్నికలే తన పాలనకు రెఫరెండం అన్నారు. ఎన్నికల తర్వాత ఈ విషయమై అసెంబ్లీలో ప్రశ్నిస్తే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సభనుండి సస్పెండ్ చేశారు. దొంగ మద్యం వ్యాపారం చేసేది ముఖ్యమంత్రి సోదరుడు రామ్మూర్తి నాయుడు, అతని అనుచరుడు సిఎం రమేష్; ఇందులో తనకు వాటా లేకుంటే సాక్ష్యాధారాలతో అధికారులు నిర్ధారించిన వీరి దొంగ వ్యాపారానికి ముఖ్యమంత్రి ఎందుకు బ్రేకులు వేయడం లేదని ప్రశ్నించారాయన. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం చేత కాకపోయినా పదివేల మద్యం షాపులు పెట్టిన ఘనత మాత్రంచంద్రబాబు దక్కించు కొన్నారని అనగానే సభలో చప్పట్లు మార్మోగాయి. హైటెక్ సిటీ, తిరుపతిలో క్యూ కాంప్లెక్స్ పనులను ఎల్ అండ్ టి సంస్థకు ఏకపక్షంగా ఇచ్చి ముఖ్యమంత్రి పెద్దమొత్తం బొక్కారు. బ్రాందీ షాపుల లాబీ కూడా ఆయనకు 250 కోట్ల భారీ ముడుపు అందించింది. చంద్రబాబు పాలనలో ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేదు; 300 మంది కాంగ్రెస్ కార్యకర్తలను, వందలాది మంది పత్తిరైతులను పొట్టన పెట్టుకొన్న ముఖ్యమంత్రికి ఆ కుటుంబాల ఉసురు తప్పక తగులు తుందన్నారు. ఇంటికో ఇంజనీరింగ్ కాలేజి ఇస్తున్న ముఖ్యమంత్రిని మించిన అవినీతి పరుడు, వెన్నుపోటు దారుడు, మోసగాడు దేశంలో మరొకరు లేరని పి. జనార్ధన రెడ్డి విమర్శించారు.

మాజీ ముఖ్యమంత్రి, బాపట్ల ఎమ్పీ నేదురుమల్లి జనార్ధన రెడ్డి మాట్లాడుతూ

**డిసిసి సభలో నేదురుమల్లి జనార్దన రెడ్డి**

చంద్రబాబు నాయుడువి అన్నీ కొత్తపోకడలే. రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలో ఇప్పటి ఏ ప్రభుత్వం సస్పెండ్ చేయనన్నిసార్లు కాంగ్రెస్ శాసన సభ్యులను సస్పెండ్ చేయించాడు. ప్రతిపక్షం మొత్తాన్ని సభ నుండి బయటకు పంపి విద్యుత్ బిల్లును పాస్ చేయించు కోవడం కన్నా అన్యాయం వేరొకటుంటుందా అని ప్రశ్నించారు. జన్మభూమి కార్యక్రమం పెట్టే వరకు దగ్గుమందు కోసం కూడా రోగులు వేచి చూడాల్సిన దుస్థితి రాష్ట్రంలో నెలకొని వుంది. ప్రజల స్పందనే వుంటే కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి 'కోకో కోలా' ప్రకటనలకు వినియోగించినట్లు జన్మభూమి టోపీలను ప్రత్యేకంగా అచ్చేసి పంచాల్సిన అవసరం వచ్చేది కాదన్నారు. వాజ్‌పేయి ప్రభుత్వం తన మిత్రపక్షాలను పొగడడానికి మినహా, ప్రజాసేవ చేయడానికి ఇంతవరకు ఒక్క క్షణం వెచ్చించ లేకపోతున్నారని మరక అంటించారు. ప్రధాని అంగ్యాక పార్లమెంటులో రాష్ట్రపతి చేత బిజెపి పచ్చి అబద్ధాలు చదివించింది. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ ఎక్కడ పాల్గొన్నది? గాంధీజీని చంపినవారే, ఆయనను ప్రశంసిస్తే

కొరవ 12వ పేజీలో




సింహపురి ఇఎన్‌టి సర్జన్స్ అసోసియేషన్ ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న డాక్టర్ జెట్టి శేషారెడ్డి. డాక్టర్లు హరిశ్చంద్రారెడ్డి, వైఎస్. రెడ్డి, కె.ఆర్. రామలింగం తదితరులు వేదికపై వున్నారు

# హైదరాబాద్ రైళ్లలో ఇక నుంచి కావలసినన్ని సీట్లు!

హైదరాబాద్, చార్మినార్, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లలో సెకండ్ క్లాస్‌తో పాటు ఆర్డినరీ బోగీలు పెంచేందుకు రైల్వేమంత్రి నితీష్‌కుమార్ ఒప్పుకొన్నట్లు, నెల్లూరు ఎమ్పీ శ్రీమతి పనబాక లక్ష్మి చెప్పారు.2తేది నుంచి చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ఒక అదనపు ఎసి బోగీతో నడుస్తుందన్నారు. ఈ బోగీ వల్ల రిజర్వేషన్ వెయిటింగ్ లిస్ట్ సమస్య తగ్గిపోగలదని వివరించారు. సెకండ్ క్లాస్, ఆర్డినరీ బోగీలు మూడు రైళ్లకూ పెట్టించే వరకు విశ్రమించనని నొక్కి చెప్పారామె. చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో 4తేది నుంచి రెండు సెకండ్ క్లాస్ బోగీలను జత చేశారు.

## ఎమ్పీ లక్ష్మీ చేసిన వుపకారం

### జకీర్‌హుసేన్ గొప్ప పరిపాలనాదక్షుడు

మాజీ కౌన్సిలర్ జై ఆంధ్రా గౌస్‌మొహియుద్దీన్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ జకీర్ హుస్సేన్ వర్ధంతి వెంకటేశ్వరపురంలో 3తేది ఘనంగా జరిగింది. సెంటర్‌లోని జకీర్‌హుస్సేన్ విగ్రహానికి పూలమాలలు వేసిన కాంగ్రెస్ పార్టీ నేతలు, అక్కడే ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. డిసిసి అధ్యక్షుడు సివి. శేషారెడ్డి మాట్లాడుతూ జకీర్‌హుస్సేన్ జాతీయ భావాలుగల గొప్ప ముస్లిం నాయకుడు. ఏ పదవుల నలంకరించినా ఆ పదవులకు ఎనలేని పేరు ప్రఖ్యాతులు తెచ్చి పెట్టినట్లు చెప్పారు. డిసిసి కార్యదర్శి దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ జకీర్‌హుస్సేన్ లోని నాయకత్వ లక్షణాలు చూసి కాంగ్రెస్‌పార్టీ వివిధ పదవులనిచ్చి గౌరవించిందన్నారు. నెల్లూరు మాజీ శాసన సభ్యుడు కెవి. సుబ్బారెడ్డి, ఆనం జయకుమార్ రెడ్డి, టివి. లక్ష్మి, పందిళ్లపల్లి అరుణమ్మ, కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.ఎ.ఎం. హుస్సేనీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బుచ్చి పోలీస్ స్టేషన్‌లో బ్రోకర్ల ఇష్టా రాజ్యం!



జన్మభూమి కార్యక్రమంలో భాగంగా, నెల్లూరు అంబేద్కర్ భవన్‌లో డిఆర్‌డిఎ పథకాల క్రింద అప్పుపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రులు చంద్రమోహన రెడ్డి, పరసారత్నం, ఎమ్మెల్యే విజయరామరెడ్డి, కలెక్టర్ శ్రీలక్ష్మి

బుచ్చిరెడ్డిపాళెం పోలీస్ స్టేషన్‌లో బ్రోకర్ల రాజ్యం కొనసాగుతూంది. స్టేషన్‌లో ఎస్ఐ, ఇతర పోలీసు సిబ్బంది వున్నా పెత్తనమంతా కట్టుబడిపాళానికి చెందిన తెలుగు నాయకులదే. బుచ్చి పోలీస్ స్టేషన్‌ను వీరేమన్నా వేలం పాట పాడుకున్నారా అన్నట్లుంది వీరి ధోరణి. స్టేషన్‌కొచ్చే ఫిర్యాదులను ముందుగా ఈ తెలుగు నాయకులు పరిశీలిస్తారు. కేసు నమోదు కావాలా, లేక చెత్త బుట్టలో దాఖలు కావాలా అన్నది వీరే నిర్ణయిస్తారు. కేసులు పెట్టుకొనేందుకు వచ్చిన ఇరువర్గాల నుంచి ఒక్కొక్క కేసుకి ఒక్కొక్కరకమైన ఫీజు నిర్ణయించి, దాన్ని వసూలు చేస్తారు. సాయంత్రానికి అయిన వసూళ్లలో 50 శాతం ఎస్ఐకి, 25శాతం సిబ్బందికి ఇచ్చి, మిగతా 25 శాతం రాము తీసుకొంటారు. చాలా రోజులుగా ఈ తంతు కొనసాగుతూంది. ఈ తెలుగు నాయకులిద్దరిలో ఒకరు దొంగ బంగారం, మరొకరు బర్రెల దొంగతనం కేసుల్లో నిందితులట. వీరికి స్టేషన్‌లో జరిగే రాచమర్యాదలు చూస్తుంటే పోలీసు వ్యవస్థ ఎంతగా దిగజారి పోయిందో ఇట్టే అర్థమై పోతుంది. ఎస్‌పి గారు ఒకసారి బుచ్చి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి ఈ వ్యవహారం సరిదిద్దండి.

# అటవీ స్మగ్లర్లతో చెట్టపట్టాలేసుకు తిరిగాడు ముఖ్యమంత్రి!

పలుగు, పార పట్టుకొని పత్రికలకు ఫోజు లిచ్చేందుకు రాపూరు వచ్చిన ముఖ్యమంత్రి వల్ల లక్షలాది రూపాయల వృధా ఖర్చు, అధికారులకు హైరానా తప్ప, ప్రజలకు ఒన కూడిందేమీ లేదు. వాస్తవంగా ముఖ్యమంత్రి 1తేది ఆకిలివలస, చిట్టుపాళెం గ్రామాల్లో పర్యటించి, జన్మభూమి కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న రోడ్ల పనికి గ్రామస్తులతో కలిసి శ్రమదానం చేయాలి. ముఖ్యమంత్రి మంచి ఎండలో మధ్యాహ్నం 2.20 ప్రాంతంలో రాపూరులో హెలికాప్టర్ దిగారు. అక్కడ నుంచి ఆకిలివలస 8 కిలోమీటర్ల దూరముంటుంది. ఆ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. ముఖ్యమంత్రి కాన్వాయ్‌లోని వాహనాలన్నీ ఆ గ్రామం వైపు మళ్లడంతో, దుమ్ము విపరీతంగా లేచి వెనుక కార్లలోని వారు ఊపిరాడక ఇబ్బంది పడ్డారు. ముఖ్యమంత్రి ఆకిలివలస వెళ్లేసరికి గ్రామస్తులు ఒక్కరు కూడా శ్రమదానం చేస్తూ కనపడలేదు. అక్కడ వుండిన నలుగురైదుగురు కూలీలతో కలిసిముఖ్యమంత్రి ఒక్క నిమిషం పాటు గడ్డపార పట్టుకొని పత్రికల ఫోటోగ్రాఫర్లకు ఫోజులిచ్చి, ఆ వెంటనే గ్రామంలోని చెరువు వద్ద చేపడుతున్న ఎత్తిపోతల పథకం పని వద్దకు చేరారు. అక్కడా పట్టుమని పది మంది లేరు. ఎల ఆరు దిగి, ఓపెన్ టాపు జీపెక్కిన ముఖ్యమంత్రి ఐదు నిముషాల పాటు పత్రికల వారి నుద్దేశించి మాట్లాడారు. తన పర్యటన సందర్భంగా రేగిన దుమ్మును స్వయంగా చూసిన సిఎం, ఈ గ్రామానికి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

**ఆకిలివలసలో కూలీలు తప్ప పట్టుమని పది మంది రాలేదు; జనం వుండిన వేపినాపికి వెళ్లలేదు; ఫోటోలకు ఫోజు లివ్వడం తప్ప సిఎం వచ్చి చేసిందేమీ లేదు!**

చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో పేదరికమే కనపడ కూడదని శ్రమించి పనిచేస్తున్నాను; మీరూ శ్రమిస్తే హైస్థాయికి ఎదుగుతారు. దేశంలో ఈయేడాది 50 లక్షల పక్కా గృహాలు కడితే అందులో 30 లక్షలు ఆంధ్రప్రదేశ్‌లోనే కట్టారు. 750 కోట్లు బియ్యం పథకానికి వెచ్చిస్తున్నాం. ఏ ప్రభుత్వ పాలనలోనైనా ఇంతఎండల్లో అధికారులు మీ వద్దకు వచ్చారా అనిప్రశ్నించారాయన. ఆయన ప్రశ్నకు సమాధానం చెప్పడానికి అక్కడ ఆ గ్రామానికి చెందిన వారెవరూ లేరు - నెల్లూరు నుంచి వెళ్లిన అధికారులు, పత్రికల వారు తప్ప! రాపూరు ఎమ్మెల్యే వైఎస్ఆర్ ముఖ్యమంత్రి పర్యటనను ఎందుకింత అభాసుపాలు చేశారో అర్థమే కావడం లేదు. పట్టుమని పదిమంది జనాన్ని కూడా పోగేయ లేదాయన. అత్యంత పేలవంగా వుండిన తన సభలని చూసి ముఖ్యమంత్రి చిటపటలాడారు. అవమానం కదా , పాపం! తిరుగు ప్రయాణంలో గ్రామం లో ని వైద్య శిబిరాన్ని ముఖ్యమంత్రి సందర్శించారు. తానెక్కిన కారు మార్గ మధ్యంలో ఆగి పోవడంతో రుసరుస లాడుతూ మరో కారు లోనికి మారారు. ఆ కోపాన్ని రాపూరు ప్రభుత్వాసుపత్రిలోని ఇన్‌ఛార్జి మహిళా డాక్టర్‌పై చూపించారాయన. హెలిపాడ్‌కు తిరిగి పోబోతూ రాపూరు ఆస్పత్రిలోనికి కారు మళ్లించారు. ఆస్పత్రి నిర్వహణ తీరుపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నా, ఆ లేడి డాక్టర్ నోరు మెదపలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే కదా మేము పనిచేసేది అని ముఖ్యమంత్రిని తిరిగి ప్రశ్నించడం సాధ్యం కాదు కదా పాపం! తమని కాన్వాయ్‌లో వెనుక పడేశారని ముఖ్యమంత్రికి కొందరు

## జిల్లావార్తలు

విలేఖరులు ఫిర్యాదు చేశారు. అప్పటి వరకు పక్కనే ఉన్న ఐదు శాఖల మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అక్కడ నుంచి తెలివిగా తప్పించు కొన్నారు. పత్రికల్లో ఫోటోల కోసం చిరునవ్వులు చిందిస్తూ అమాయకంగా పక్కనే నిలబడి వుండిన సాంకేతిక విద్యా శాఖ మంత్రి పరసా రత్నంను ఆ మాత్రం 'మెయింటెనెన్స్' చేయలేరా అని పిల్చి చీవాట్లు పెట్టారు. ముఖ్యమంత్రికి తెలిసి జరిగిందో, తెలియక జరిగిందో మనకైతే తెలియదు కాని, ఈ ఆకిలివలస గ్రామం అటవీ స్మగ్లర్ల స్వర్గధామం, రక్తచందనం దొంగ రవాణాకు కేంద్రం; అక్రమంగా వేటాడి, చంపే దుప్పి మాంసం విక్రయానికి కూడలి. ఈ పర్యటనలో ముఖ్యమంత్రిని స్వాగతించి, ఆయన ప్రక్కన నిలబడి, ఫోటోలకు ఫోజులిచ్చిన తెలుగు నాయకుడు

తరువాయి 8వ పేజీలో

# గూడూరు ఎమ్మెల్యేపై కోపంతో మంత్రిని నిలేశారు జనం!

ఐదుశాఖల మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని గూడూరు మండలం వేముల పాళెం గ్రామస్తులు నిలదీసేసరికి, ఆయనకు నోట మాటరాలేదు. 3తేది ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌తో కలిసి జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆ గ్రామానికి వెళ్లాడు మంత్రి. సిఎంఇవై పథకంలో భాగంగా గొర్రెల పెంపక కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడ నారంభించేసరికి, గ్రామస్తులు మంత్రి ప్రసంగానికి అడ్డు తగిలారు. గత ఏడాది శ్రమదానం పథకంలో ప్రారంభించిన అంగన్‌వాడీ భవనం ఇంత వరకు పూర్తికాలేదు. గ్రామంలో ప్రజలు తాగడానికి నీళ్లు లేవు; రోడ్లు లేవు; డెనేజి పథకాన్ని ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పి మాట్లాడమన్నారు. దిక్కుతోచని మంత్రిని, ఎమ్మెల్యే స్టేజి దింపి కారు నెక్కించేసి తాను సమస్యలకు సమాధానం చెబుతానన్నాడు స్టేజిపైనే కూర్చొన్నారు. ప్రజలు పలురకాలుగా పరుష వాక్యాలు పల్కినా వూరకున్న ఎమ్మెల్యే, అధికారులే సమస్యల పరిష్కారానికి అడ్డంకులు కల్పిస్తున్నారని చెప్పి తప్పించు కొన్నారు. గూడూరు ఎమ్మెల్యే దుర్గాప్రసాద్‌కు నియోజక వర్గంలో తీవ్ర వ్యతిరేకత వుంది. ఆ విషయం తెలియక మంత్రి గూడూరు పర్యటనకు వచ్చి ప్రజల చేత మాటలు పడ్డారు!

### నీటిపథకాలనురక్షించండి

వెంకటగిరి నియోజక వర్గంలో ఎమ్పీ గ్రాంటుతో నిర్మించిన మినీ రక్షిత నీటి పథకాలు ప్రజలకు ఏ మాత్రం ఉపయోగ పడడం లేదు. 1994లో అప్పటి ఎమ్పీ చింతామోహన్ వెంకటగిరి ప్రజల దాహార్తి తీర్చను తన గ్రాంటు నుంచి 25 లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఈ నిధులతో గ్రామాలలోని తాగునీటి బోరుకు, కరెంటు మోటారు బిగించే రీతిలో పథకానికి రూపకల్పన చేశారు. మోటారు బిగించడానికి 30 వేలు, తాగునీటి సరఫరా తొట్టి

**దుర్గాప్రసాద్ గారూ- ప్రజలలో తమకు ఎంత గొప్ప పేరు?**

కట్టేందుకు మరో 50 వేలు కేటాయించి, 69 మినీ నీటి పథకాలు నిర్మించారు. గ్రామస్తులకు ఈ పథకాన్ని ఏ విధంగా ఉపయోగించు కోవాలన్న విషయాన్ని అధికారులు తెలియజేయక పోవడం వల్ల, ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు ఉపయోగించు కొనారంభించారు. దీనివల్ల పలు పథకాలకు సంబంధించిన మోటారు కాలిపోవడంతో ఈ పథకం మూలన పడిపోయింది. దీనివల్ల మండలంలోని పలు గ్రామాల్లో ప్రస్తుతం నీటి సమస్య ఏర్పడి వుంది. ప్రజా సంక్షేమం దృష్ట్యా కొత్త నిధులు విడుదల చేసి ఈ మోటార్లకు రిపేర్లు చేయించకపోతే పథకం పక్కత్రోవ పట్టిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# అల్లూరు ఆర్‌టిసి బస్సులతో ఎన్ని అగచాట్లో?

ఎన్నేళ్లు గడిచినా సంఖ్య పెరుగక, సమయ పాలనలేని ట్రిప్పులతో ఆర్టీసి బస్సులు అల్లూరు ప్రజలను విసుగెత్తిస్తున్నాయి. అల్లూరు మండల జనాభా 70 వేలకు పైబడి వున్నా ఆర్టీసి చాలినన్ని బస్సులు నడపడం లేదు. ప్రైవేట్ బస్సులను జాతీయం చేసే సమయంలోనే, అల్లూరుకు 25 బస్సులు నడుస్తుండేవి. ఇది జరిగి దశాబ్దం గడుస్తున్నా ఇప్పటికీ కనీసం అదే సంఖ్యలో కూడా ఆర్టీసి బస్సులను నడపడం లేదు. దీనివల్ల తాటిచెట్లపాళెం, వెన్నారాయునిపాళెం, ఇస్కపల్లి పురిణి, కావలి రూట్‌లలో నడిచే బస్సులలో ప్రజలు కిక్కిరిసి ప్రయాణం చేస్తుంటారు. అల్లూరు ప్రజలకు అందుబాటులో లేని చోట ఆర్టీసి బస్టాండ్‌ను కట్టడం వల్ల అది ఏ మాత్రం ఉపయోగపడడం లేదు. ప్రజలకు బస్సుల రాకపోకలు తెలియజేసే బోర్డులను ఎవరూ చూడకూడదని కాబోలు, అందుబాటులో లేని చోట్ల అమర్చారు. అల్లూరు రూట్‌లో నడిచే ఏ బస్సూ సమయం పాటించదు. దీనివల్ల ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు బ్రహ్మాండంగా లాభ పడుతున్నారు. అల్లూరు నుంచి రాత్రి 8.30 దాటాక ఆర్టీసి బస్సులు నడపక

**ప్రయాణీకుల సంఖ్య అపరిమితంగా పెరుగుతున్నా బస్సుల సంఖ్య మాత్రం పెరగడం లేదు!**

పోవడం వల్ల, ప్రజలు టాక్సీలను ఆశ్రయించాల్సి వస్తున్నది. నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్‌లో తమకు కేటాయించిన ప్లాట్‌ఫారంలో అల్లూరు బస్సులు ఆగక ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. చాలినన్ని బస్సులు వేసి, ఖచ్చితమైన సమయాల్లో వాటిని నడపమని ప్రజలు అధికారులకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా చెవిటి ముందు శంఖం ఊదినట్లుంది. అల్లూరులోని వివిధ పార్టీల నాయకులు బస్సుల్లో పయనించే స్టేజిని దాటి పోయారు. దీనితో ప్రజలు పడే కష్టాలను తీర్చే వారే కరువయ్యారు.

### కోవూరు షుగర్ ఫ్యాక్టరీ వెంకటేశ్వరుడు

కోవూరు షుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో కొత్తగా నిర్మించిన ఆలయంలో 7తేది వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు. సెక్యులర్ దేశంగా ప్రసిద్ధిచెందిన మన దేశంలోని ప్రభుత్వ కర్మాగార ఆవరణలో ఒక మతానికి సంబంధించిన దేవాలయం నిర్మించడం సబబు కాదు. ఈ ధోరణిని అరికట్టడం మంచిది.

# నెల్లూరు ముచ్చట్లు

## విశ్వమిత్ర

### జనార్ధనరెడ్డి

మాజీ ముఖ్యమంత్రి, బాపట్ల ఎమ్పీ శ్రీ నేదురుమల్లి జనార్ధనరెడ్డి 14తేది ఉదయం ఒంగోలు వస్తారు. మార్టూరు నియోజక వర్గం ఒల్లికురవ మండలంలో పర్యటిస్తారు. సాయంత్రం బాపట్లలో కొన్ని పెళ్లిళ్లు, పరామర్శల తర్వాత రాత్రికి హైదరాబాద్ వెళ్లి పోతారు. ఇప్పట్లో నెల్లూరు వచ్చే ఆలోచనేదీ వున్నట్లు లేదు.

### చంద్రమోహనరెడ్డి

ఐదు శాఖల మంత్రి శ్రీ సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి ఈ వారమంతా నెల్లూరులోనే గడిపి, ఈ రోజు (8తేది) మద్రాసు మీదుగా హైదరాబాద్ వెళ్లారు. ఎప్పటి మాదిరి సర్వేపల్లికి అంకితం కాకుండా, ఈసారి రాపూరు, అల్లూరు, ఆత్మకూరు వగైరా నియోజక వర్గాలలోనూ పర్యటించాడు. అంటే జిల్లా ఎమ్మెల్యేలు ఇప్పటికి ఆయన్ను మంత్రిగా గుర్తించారన్న మాట. మంచి అభివృద్ధే!

### ఎండలు

సూర్యప్రతాపం ప్రతిదినం అనుభవంలోకి వస్తున్నది. మండే కొలిమి ప్రక్కన కూర్చున్నట్లు వుంటున్నది - మధ్యాహ్న సమయంలో రోడ్లో నడవాలంటే. ఉదయం నుంచే వేడి సెగలు; ఆ తాపం భరించ లేకపోతున్నారు జనం. ఒకే అదృష్టం - కరెంట్ సమస్య లేకపోవడం. దాని పుణ్యానికి కోతలేదు. ఈ వారంలో ఎండల వివరం ఇదీ - (బ్రాకెట్లలోవి సెంటిగ్రేడ్ డిగ్రీలు)

| | | |
|---|---|---|
| 1తేది | 101.6 ఫా.హి | (38.7) |
| 2తేది | 101.3 ఫా.హి | (38.5) |
| 3తేది | 102.2 ఫా.హి | (39.0) |
| 4తేది | 105 ఫా.హి | (40.6) |
| 5తేది | 105.8 ఫా.హి | (41.0) |
| 6తేది | 100.4 ఫా.హి | (38.0) |
| 7తేది | 98.0 ఫా.హి | (36.7) |

### టీచర్ పోస్టులు - పోటీ నామ మాత్రం

జిల్లాలోని 1548 సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు మొత్తం 3737 మంది వ్రాత పరీక్ష వ్రాస్తే 1716 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు సెలక్ట్ అయ్యారు. అంటే ఉద్యోగాలకు పోటీ నామ మాత్రమన్న మాట. అందువల్ల ఏ కొంచెం అర్హతలున్న అభ్యర్థులకైనా ఉద్యోగాలు గ్యారంటీ. ఈ వాస్తవం గ్రహించి ఉద్యోగార్థులు రెకమెండేషన్ల కోసం, లంచాలు ఇచ్చే ప్రయత్నం కోసం సమయం వృధా చేసుకోకుండా వుండడం మంచిది. ఉద్యోగం ఇప్పిస్తామని ఆశ చూపేవారి వలలో పడకుండా జాగ్రత్త పడండి; అది అనవసరం కూడా!

ఇంటర్వ్యూలు 11తేది నుంచి 24తేది వరకు కలెక్టరేట్‌లోని గోల్డెన్ జూబిలీ హాల్‌లో జరిపిస్తారు.

### కలెక్టర్ సందడి

కొత్త కలెక్టర్ శ్రీమతి శ్రీలక్ష్మి చాలా సందడి సృష్టిస్తున్నారు. ఆమె ఛార్జి తీసుకొని పదిరోజులు కాలేదు - అప్పుడే జిల్లా అంతా చుట్టి వచ్చేశారు. జన్మభూమి కలిసిరావడంతో ఈ వారమంతా బిజీగా తిరిగే అవకాశం లభించింది ఆమెకు. సిఎం చంద్రబాబు చెప్పినట్లు - జన్మభూమిలో తనకు వచ్చే అర్జీలను ఖచ్చితంగా 15 రోజుల లోపల పరిష్కరించేస్తానని హామీ ఇస్తున్నారామె. పోయిన-దగ్గరల్లా ఎమ్మార్వోలను, డాక్టర్లను, ఇతర వుద్యోగులను గడగడ లాడించేస్తున్నారు. ఆమె ప్రశ్నల ధాటికి బిత్తర పోతున్నారు అధికారులు. కలెక్టరేట్‌లోనూ క్రమ శిక్షణ నెలకొల్పడానికి ఆమె ప్రయత్నిస్తూంది. వుద్యోగులంతా సరిగ్గా 10 గంటలకు ఆఫీసుకు వచ్చి తీరాలని ఆదేశించడమే కాదు - ఆఫీసులో రౌండ్లు తిరిగి చూస్తున్నారు. ఆమె స్పీడును తట్టుకోవడం అధికారులకు కష్టంగానే వుంది పాపం!

### టిబి ఆస్పత్రి డాక్టర్‌ను డిస్మిస్ చేశారు!

నెల్లూరు టిబి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎమ్వై. ప్రసాద్‌ను ఉద్యోగం నుంచి డిస్మిస్ చేసింది రాష్ట్ర ప్రభుత్వం. ఒక టిబి రోగి నుంచి లంచం తీసుకొంటూ ఎసిబికి పట్టుబడ్డారు డాక్టర్ ప్రసాద్. దానిపై ఎసిబి కోర్టులో విచారణ జరిగి, నేరం రుజువు కావడంతో శిక్ష విధించారు. దానితో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొన్నది.

ఈ సంఘటనతోనైనా తతిమా ప్రభుత్వ డాక్టర్లు ఒళ్లు దగ్గరుంచుకొని పనిచేస్తారా?

### వెంకయ్యస్వామికి రెండు లక్షల రాబడి

గొలగమూడి వెంకయ్య స్వామి దేవాలయానికి ఏప్రెల్ నెలలో రెండు లక్షలా ఎనిమిది వేల రూపాయల రాబడి లభించింది. దాదాపు ప్రతి నెలా ఇంత ఆదాయం లభిస్తున్నది వెంకయ్యస్వామికి. ఇది కాక బియ్యం వంటి వస్తువుల రూపంలో వచ్చే కానుకలూ దండిగానే వుంటున్నాయి.

ఈ డబ్బు నంతటినీ దండగ చేస్తున్నారు నిర్వాహకులు. నిత్య అన్నదానం పేరుతో భిక్షగాళ్లను, సోమరిపోతులను పెంచి పోషిస్తున్నారు. దానికి బదులుగా ఒక సంక్షేమ హాస్టల్ నెలకొల్పి; అనాథలు, నిరుపేదలూ అయిన పిల్లలకు కులమత రహితంగా భోజనం పెట్టి, చదువు చెప్పించ గల్గితే స్వామి ప్రతిష్ట పెరుగుతుంది; భక్తుల కానుకలకూ సార్థకత చేకూరు తుంది - నిర్వాహకులు ఆలోచించాలి.

### ఉప ఎన్నికలు

జిల్లాలో - గూడూరు, అనంత సాగరం జడ్‌పిటిసి సభ్యత్వాలకు, నెల్లూరు మునిసిపాలిటీలోని వార్డులకు, కొన్ని పంచాయతీలకు ఈనెలాఖరులో ఉపఎన్నికలు జరుగనున్నాయి. అయితే రాజకీయవాదులలో ఈ ఎన్నికల పట్ల పెద్దగా ఆసక్తి లేదు.

### దుగార్ డిపాజిట్లు భద్రమని హామీ!

దుగార్ ఫైనాన్స్ నెల్లూరు బ్రాంచిలో డిపాజిట్ల తిరిగి చెల్లింపు సందిగ్ధంగా వుందని గతవారం మేము ప్రచురించిన వార్తకు వారి యాజమాన్యం వివరణ పంపింది. రిజర్వు బ్యాంకు తాజాగా విధించిన నిబంధనల వల్ల డిపాజిట్లు తిరిగి చెల్లించడంలో కొన్ని ఇబ్బందు లెదురౌతున్నాయి తప్ప, ప్రజలకు పంగనామం పెట్టే దురాలోచనలు తమకు లేవన్నది వారి సంజాయిషీ! డిపాజిట్ల మొత్తంలో కొంత శాతం విధిగా రిజర్వు బ్యాంకులో దాచి పెట్టాలన్న నిబంధన, ఇతర నియమాలు వున్నట్లుండి వచ్చి పడడంతో కొన్ని సమస్య లెదురయ్యాయి తప్ప, దుగార్ ఫైనాన్స్ డిపాజిటర్లను దగాచేయడం జరగదని నమ్మకంగా చెప్తున్నారు వారు. కొంత ఓపిక పడితే అన్నీ సవ్యంగా తిరిగి చెల్లించేస్తామని చెప్తున్నారు. వారు నిజమే చెప్తున్నారని నమ్మవచ్చు.

### పాలిటెక్నిక్‌లో ర్యాంకులు

ఈరోజు ప్రకటించిన పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఫలితాల్లో ముగ్గురు నెల్లూరు విద్యార్థులు ర్యాంకులు పొందారు. బి. వర్ష అనే నెల్లూరు టౌన్ విద్యార్థికి ఫస్ట్ ర్యాంక్ వస్తే బుచ్చికి చెందిన హెచ్‌వి. సాయి పవన్‌కుమార్, నెల్లూరు హరనాథపురంలోని

తరువాయి 7వ పేజీలో


**బెంగుళూరు నుంచి ప్రముఖ దంతవైద్యులు రాక**

పళ్లవరుసల హెచ్చుతగ్గులను పర్మినెంటు క్లిప్పుల ద్వారా సరిచేయు **డాక్టర్ సి. రాధాకృష్ణ** (ఆర్థోడెంటిస్టు) బెంగుళూరు నుంచి మే 9, 10, 11, 12 తేదీలలో వచ్చుచున్నారు. వారిని సంప్రదించ దలచినవారు క్రింది అడ్రసులో కలుసుకో వచ్చును. పక్క పళ్లు పర్మినెంటుగా కట్టు కాస్టు Fixed Bridge with Gold Casting సదుపాయం కలదు.

**డాక్టర్ కొండారెడ్డి దంత వైద్యశాల**

ఇందిరాభవన్ ఎదురు వీధి, నెల్లూరు, ఫోన్: 327235

Shanti Ads, Nlr



**ఖాళీ స్థలం అమ్మబడును**

కోళ్లఫారాలకు, చిన్నతరహా పరిశ్రమలకు పనికివచ్చు షుమారు 100 అం.ల స్థలము నెల్లూరుకు అతి చేరువలోని కనుపర్తిపాడులో అమ్మకమునకు కలదు. వివరాలకు

కె. పార్థసారధిరెడ్డి

ఫోన్ నం. నెల్లూరు - 322762

08621 - 87052



**DUGAR FINANCE INDIA LTD.,**

**REGD. OFFICE:** Dugar Towers, 123, Marshalls Road, P.B. 799, Egmore, Chennai - 600 008, Phone: 8553535 (10 Lines); Fax: 044 - 8552244

**REQUEST TO OUR DEPOSITORS**

Recently some of the news papers have given news items about our Financing system that we are not repaying the deposits. Regarding this we put to this before you and request you to co-operate with us. At the outset, we would like to state that our company continues to be reposed with faith and confidence by public at large for placing deposits, stemming out mainly on the fact of excellent service rendered by our company to the depositors in the matter of repayment and other services. We have been in the financial services industry for the past 16 years and we are duly registered with Reserve Bank of India and adhering to the guidelines prescribed by them from time to time.

As you would be aware of RBI brought a new set of guidelines whereby lot of Finance Companies were prohibited from accepting deposits and instead, all the deposits were to be repaid before 31.12.1998. A lot of articles have been written in press condemning the impractical nature of such strict guidelines and also predicting that such guidelines would only trigger off defaults by all the finance companies simply due to the fact of inherent asset liability mismatch. Responding to the reaction of the financial services industry, RBI has subsequently modified the guidelines requiring the finance companies to repay excess deposits by the year 31.12.2000.

Our company, in order to tide over the sudden crisis imposed by the Supervisory Authority has been requesting the depositors to renew the deposits either wholly or partly so that the deposits can be repaid staggered manner so that RBI stipulation for repayment of excess deposits before the said deadline could be met. This has been done solely for the interest of the depositors so that the demands of all the depositors can be met fully and the depositors also stand to enjoy the benefits of interest for the renewed portion.

The company always stood for "Stability, Faith and Confidence". There is no reason why we should suddenly go back from this theme after practising it for 15 years. Hence the request to the depositors to renew the deposits is only a temporary measure to tide over the crisis brought upon the Company by an outside regulation.

Currently, our Branch at Nellore is functioning from the same address and is also staffed. In any case, depositors are free to contact Branch Office / Head Office for any clarifications.

... COMPANY SECRETARY



KIDS GALAXY

**MODERN SCHOOL**


Saraswathi Nagar, Nellore - 2, Ph: 327788

ADMISSIONS COMMENCED FOR 1998-'99

PLAY CLASS TO TENTH LIMITED SEATS

NO DONATIONS:: NO RECOMMENDATIONS

RESERVE YOUR SEAT NOW ITSELF



ADMISSION TEST ON 16.5.1998 AT 9.00 A.M.

OFFICE WORKING HOURS: 9 a.m. to 11 a.m.

# నెల్లూరుముచ్చట్లు

6వ పేజీ తరువాయి

ఎ. సుధీర్ కుమార్ సెకండ్ ర్యాంక్ సాధించారు. అంటే రాష్ట్ర స్థాయిలో మొదటి రెండు ర్యాంకులూ నెల్లూరుకే లభించాయన్న మాట. కంగ్రాచ్యులేషన్స్!

## ఇఎన్‌టి డాక్టర్ల సభ

నెల్లూరులోని చెవి ముక్కు డాక్టర్లందరూ కలిసి - సింహపురి ఇఎన్‌టి సర్జన్స్ అసోసియేషన్ - పేరిట ఒక సంఘం పెట్టుకున్నారు. మొన్న 26తేది ఐఎంఎ హాలులో ఈ సంఘం ప్రారంభోత్సవ సభ జరిగింది. డాక్టర్ జెట్టి శేషారెడ్డి అధ్యక్షించారు. ఇటీవలి కాలంలో ప్రజలలో పెరిగిపోయిన 'గురక' సమస్యను లేజర్ సర్జరీ ద్వారా నివారించ కోవచ్చునని మద్రాసు నిపుణుడు డాక్టర్ కె.ఆర్. రామలింగం చెప్పారు.

సంఘం అధ్యక్షుడుగా డాక్టర్ ఎ. హరిశ్చంద్రారెడ్డి, కార్యదర్శిగా డాక్టర్ వైఎస్. రెడ్డి ఎన్నికైనారు.

## జిల్లా జడ్జి బదిలీ

నెల్లూరు జిల్లా జడ్జి శ్రీ సురేష్‌చంద్ర పట్నాయక్‌ను, హైదరాబాద్ ఛీఫ్ మెట్రోపాలిటన్ స్పెషల్ జడ్జిగా నియమించారు. అదిలాబాద్ నుంచి శ్రీ ఎ. ప్రభాకరరెడ్డిని నెల్లూరుకు మార్చారు.

***

నెల్లూరు ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జిని హైదరాబాదుకు బదిలీ చేసి, ఆయన స్థానంలో నెల్లూరు ఎసిబి కోర్టు న్యాయమూర్తిగా వున్న ఎన్. రవి శంకర్‌ను ఇక్కడ నియమించారు.


నెల్లూరు జిల్లా జడ్జి కోర్టులో

O.P. No. 184/97

కమతం తిరుపతమ్మ మరియు
ఇతరులు ... క్లయిమెంటులు

Vs.

ఖాజా హుస్సేన్, s/o హుస్సేన్
భాయ్, 19-5-32/13/28, కిషన్‌బాగ్,
హైదరాబాద్ ... రెస్పాండెంట్

నోటీసు

ఖాజా హుస్సేన్ మరియు ఇతరులు

పై నంబరు దావా క్లయిమెంట్సు మీపై దావా వేసియున్నారు. సదరు దావా మీకు నోటీసు నిమిత్తం 17-6-98 తేదీన వాయిదాగా వున్నది. కావున మీకు గల ఆక్షేపణలను వాయిదా రోజున ఉదయం 10.30 గంటలకు పై కోర్టువారి ఎదుట మీరు గాని, మీ తరపున లాయరు గాని హాజరై తెలుపుకొన వచ్చును. లేని ఎడల మీ పరోక్షమున కేసు విచారించి తీర్మానించ బడును.

ఆర్. సత్యనారాయణ
క్లయిమెంట్సు తరపు అడ్వకేటు
నెల్లూరు


## ఈదగాలి భూములు- రాజకీయ రగడ

మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి ఎవరి మీదనైనా కక్ష కడితే - ఇక దానికి పట్టు విడుపులే వుండవు. వెంకటాచలం మండలం ఈదగాలి పెద్ద రైతు కుటుంబం వేమారెడ్డి శ్యామసుందరరెడ్డి విషయంలో ఇదే జరుగుతూంది. ఆగర్భ శత్రువుల వలె తయారై పోయారిద్దరూ!

వీరి దాయాది పోరుకు తాజా గోదా - వరగలి కోదండరామస్వామి భూములు. ఆ స్వామి వారికి శ్యామయ్య పూర్వీకులే కొన్ని వందల ఎకరాల ఆస్తి బహూకరించారు. ఆ గుడికి ధర్మకర్తలూ వారే కాబట్టి ఆ భూములను కౌలుకు ఇవ్వడం, రాబడిని ఖర్చు పెట్టడం వారి చేతుల మీదుగానే జరుగుతూంది. ఈ సాంప్రదాయానికి బ్రేక్ వేయజూశాడు చంద్రమోహనరెడ్డి. ఆ భూములకు కౌలు వేలం పాటలు నిర్వహింపజేశాడు. గ్రామస్తు లెవరూ పాటలో పాల్గొనక పోవడంతో నెల్లూరు నుంచి తన అనుచరులను పంపించి పాట పాడించారు. దీనిపై పెద్ద రగడ; నెల్లూరు నుంచి హైదరాబాదు వరకు అన్ని కోర్టులలోనూ కేసులు దాఖలైనాయి. చివరకు హైకోర్టు స్టేతో మొత్తం వేలం పాట వ్యవహారం వర్కౌ పోయింది.

వరగలి కోదండరామస్వామి వేమారెడ్డి కుటుంబీకులకు ఇలవేల్పు; ఏటా కొన్ని లక్షలు తమ స్వంత డబ్బు ఖర్చు చేసి స్వామిని అర్చిస్తారు వారు. జిల్లాలో అంత సాంప్రదాయబద్ధంగా పూజాదికాలు జరిగే వైష్ణవాలయం మరొకటి లేదనడం నిజం. లక్షలాది రూపాయలు విలువ చేసే బంగారు, వజ్రాల నగలు సైతం భగవంతుడికి అర్పించారు వారి పూర్వీకులు. అంత భక్తిగా అర్చించే స్వామివారి ఆస్తిని దిగ్రమింగుతారా వారు? చంద్రమోహనరెడ్డికి కావలసింది వారి కుటుంబం రచ్చకెక్కడం; అందుకే ఈ రభస అంతా!

పవర్‌లో వున్నప్పుడు ఎవరినైనా సతాయించే అవకాశం రాజకీయవాదులకు లభిస్తుంది; అది సహజం. అందులో గొప్పేమీ లేదు. కాని ఆ అధికారం పోయిన తర్వాత శత్రుత్వం మాత్రమే మిగుల్తుంది! అధికారం శాశ్వతం కాదు; ఈ నిజమూ ఇప్పుడు అర్థం కాదు!

## చిన్న చెరుకూరు భూ ఆక్రమణ

చిన్న చెరుకూరు గ్రామంలో తోటపల్లి గూడూరు పంచాయతీ సమితికి చెందిన ఎకరా యాభై సెంట్ల విలువైన భూమిని బొమ్మి సురేంద్ర అనే చేపల రైతు ఆక్రమించి వున్నాడని ఆగ్రామస్తులొకరు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ భూమిని ముప్పయ్యేళ్ల క్రితం వేమారెడ్డి రామరాఘవరెడ్డి గారు సమితికి విరాళంగా ఇచ్చి, రిజిస్టర్ కూడా చేయించారట. అక్కడ పశువులాస్పత్రి కట్టించాలన్నది ఆయన సంకల్పం. కాని ఈ ముప్పయ్యేళ్లలో ఆ కోరిక తీరినట్లు లేదు. ఇప్పుడా స్థలం చేపల చెరువుల్లో కలిసిపోయింది. అధికార్లకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించు కోవడం లేదని గ్రామస్తుల ఫిర్యాదు.

ఆర్‌డిఒ గారూ - తక్షణం దీనిపై సర్వే జరిపించి ఆ భూమికి ఆక్రమణ చెర తప్పించండి! దాన్ని విక్రయిస్తే వచ్చే ధనంతోనే ఇప్పుడు మంచి ఆస్పత్రి భవనం కట్టించవచ్చు.

## వడ్లకొలతల్లో దళారుల దగా

నెల్లూరు జిల్లా వడ్ల కొనుగోలు దారులు, బ్రోకర్లు కలిసి కొలతల్లో రైతులను దగా చేస్తున్నారు. పుట్టెడు వడ్లకు ఎన్ని కిలోలు వుంటాయో తెలియని రైతులు అమాయకత్వాన్ని క్యాష్ చేసుకొంటున్నారు వీరు.

పుట్టెడు వడ్లు అంటే 850 కిలోలు మాత్రమే. కాటాతో తూచేటప్పుడు బస్తాకు 42.5 కిలోల నికర తూకం పెడితే సరిపోతుంది. కానీ బ్రోకర్లు 43.5 కిలోలు పెడుతున్నారు. దీని వల్ల రైతులు పుట్టెడు తూకానికి ఇరవై కిలోలు నష్టపోతున్నారు. ఇది కాక బస్తాకు ఒక కిలో అదనంగా కాటా బరువు నిర్ణయిస్తున్నారు. నిజానికి బస్తా బరువు 100 గ్రాములు మాత్రమే. అంటే ఆ రూపంలో పుట్టెడు తూకానికి మరొక 5 కిలోలు నష్ట పోతున్నాడన్న మాట రైతు.

కాటా ఖచ్చితంగా వుంటేనే ఈ మాత్రం దగా; కొందరు డీలర్లు కాటాలో మెస్మరిజం చేస్తున్నారు. అప్పుడు రైతుకు జరిగే నష్టం ఇంకా అధికం. కాటా తూకాల పద్ధతి కొన్ని దశాబ్దాల నుంచి అమలులో వున్నా - దాని మర్మం రైతులు ఇప్పటికీ గ్రహించలేక పోవడం దురదృష్టకరం. ఒక పుట్టెడుకు ఒక తూము వరకు తూకంలో దగా పడితే రైతులు బ్రతికేదెండి?

కలెక్టర్ గారు ఈ విషయంలో జోక్యం చేసుకొని, వడ్ల వ్యాపారస్తులను కఠినంగా మందలించడం, అవసరమైతే శిక్షించడం అవసరం.

## వెంకన్నపాళెం విఎఒపై దౌర్జన్యం

మనుబోలు మండలం వెంకన్న పాళెం గ్రామ విఎఒ శ్రీ వి.ఎ. పద్మనాభరెడ్డి మీద అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు దౌర్జన్యం చేశారు. మాగాణి పొలంలో, అనుమతి లేకుండా రొయ్యలు చెరువులు త్రవ్వడంపై విఎఒ అభ్యంతరం పెట్టడంతో, ఆ యువకులు ఆయనపై పడి కొట్టారట. ప్రక్కన పోలీస్ కానిస్టేబిల్ వుండినా ఈ దౌర్జన్యం ఆపలేకపోయి నట్లున్నాడు.

గ్రామాలలో విఎఒలు కీలకమైన ప్రభుత్వ ప్రతినిధులు. వారికే రక్షణ లేకుంటే గ్రామాలలో అరాచకం రేగుతుంది. పోలీసులు ఈ దౌర్జన్యం చేసిన వారిని శిక్షించాలని జిల్లా విఎఒల సంఘం కార్యదర్శి శ్రీ చిట్టమూరు దశరథరామిరెడ్డి కోరుతున్నారు.

# బడ్జెట్

2వ పేజీ తరువాయి

ప్రకటించి వున్నారు. అందువల్ల ఆర్థికమంత్రి తలపెట్టే పథకాలకు నిధుల కొరత ఎదురౌతుంది.

ఈ బడ్జెట్‌లో ఆర్థికమంత్రి దిగుమతులపై సుంకాలు పెంచుతాడన్నది ఒక అంచనా. మన్‌మోహన్ సింగ్, చిదంబరంలు క్రమ పద్ధతిలో దిగుమతి సుంకాలు తగ్గించు కొంటూ వచ్చారు. ఆరేడేళ్ల నాటి కస్టమ్స్ డ్యూటీకి, ఇప్పటికీ పోలికే లేదు. అయితే కొత్త ఆర్థిక మంత్రి ఆ పద్ధతి విడనాడి దిగుమతి సుంకాలను పెంచేందుకు సుముఖంగా వున్నట్లు సూచనలు అందుతున్నాయి. స్వదేశీ పారిశ్రామిక వేత్తలకు ప్రత్యేక రక్షణ కల్పించే చర్యలూ చేపట్టబోతున్నారు. *


ఎంసెట్‌లో మెడికల్ సీటు రాలేదని దిగులుపడొద్దు!

రష్యాలో మెడిసిన్ సీటు పొందండి

ప్రపంచంలోని WHO, BMC, IMC, UNESCO, USA, AUSTRALIA, EUROPE, ASIA దేశాలచే రికగ్నైజ్ చేయబడిన -

రష్యాలోని ఇ.పి. పవలోవ్ స్టేట్ మెడికల్ యూనివర్శిటీ (సెంట్ పీటర్స్‌బర్గ్)లో సీటు సంపాదించుటకు మా సహకారాన్ని పొందండి.

ఆరు నెలల ప్రిపరేటరీ కోర్సు- తర్వాత ఆరు సంవత్సరాల మెడికల్ కోర్సు- ఆపై M.D. జనరల్ మెడిసిన్ చదవవచ్చు.

అర్హత: ఇంటర్ BiPC దానికి సమానమైన విద్య - అందులో 60% మార్కులు - 17 సంవత్సరాల వయస్సు.

* వీసా, పాస్‌పోర్టులు యేర్పాటు చేయబడును.
* ఫీజు తదితర వివరాలకు సంప్రదించండి

ఆంధ్రమిత్ర ఇంటర్నేషనల్

No.12, మొదటి అంతస్తు, రత్న ఆర్కేడ్, ద్వారకా నగర్, విశాఖపట్నం-530 016, ఫోన్స్: (O) 548043; (R) 553579



ఇల్లు అమ్మబడును

27 1/2 అంకణాల స్థలములో, 9 అంకణాల గ్రౌండ్ ఫ్లోరు, 9 అంకణాల మొదటి ఫ్లోరు, 4 1/2 అంకణాల 2వ అంతస్తు కలిగి అన్ని వసతులు కలిగిన మిద్దెయిల్లు అమ్మబడును. వివరాలకు

వై.వి. సుబ్రమణ్యాం
No. 27/II/72, 1st Floor,
సాయిబాబా నర్సింగ్ హోమ్ వీధి,
బాలాజీ నగర్, పోలీస్ స్టేషన్ దగ్గర,
నెల్లూరు - 524 002



ఇల్లు అమ్మబడును

నెల్లూరు సబేదార్‌పేట, ద్రోణంరాజువారి వీధి, డోర్ నం.17/51 నందు సుమారు 33 అంకణాల కట్టుబడి గల మిద్దెయిల్లు అమ్మబడును. వివరాలకు

జె. క్రిష్ణయ్య
27/345, గాయత్రీనగర్,
మొదటి రోడ్డు, కొంటు ఆఫీసు
ప్రక్కన, దర్గామిట్ట, నెల్లూరు-4.
ఫోన్ నం. 327906



కళ్యాణ వేడుకలకు సరికొత్త పట్టుచీరల శ్రేణి



కంచి సొసైటీ, ధర్మవరం పట్టుచీరల విస్తృత శ్రేణి గద్వాల్, వెంకటగిరి, కొత్తకోట, ఆరణి చీరలు, ఫ్యాన్సీ చీరల అతిపెద్ద షోరూం.

ప్రముఖ కంపెనీల సూటింగ్స్, షర్టింగ్ బిట్స్‌పై సూపర్ ఆఫర్

ఈ అవకాశం కొద్దిరోజులే

చందన శారీ మందిర్
లేడీస్ & జెంట్స్ డ్రెస్ ఎంపోరియం
ట్రంక్‌రోడ్, నెల్లూరు.
PH: 323420

హోల్‌సేల్ రేట్లకే రిటైల్ అమ్మకంచేసే ఏకైక సంస్థ

ALL CREDIT CARDS ACCEPTED



జమీన్‌రైతు

చందా చెల్లించండి

జమీన్‌రైతు పాత చందాదారులకు చందా 31.3.98 తేదికి పూర్తయ్యింది. 1.4.98 తేది నుండి సంవత్సర చందా దయచేసి వెంటనే చెల్లించి పత్రిక నిర్వహణకు సహాయపడ ప్రార్థన. పోయిన సంవత్సరం చందా బాకీ వున్నవారు కూడా ఈ సంవత్సరం చందాతో కలిపి పంపండి. చందా డ్రాఫ్ట్, ఎం.ఓ. ద్వారా చెల్లించవచ్చు. చెక్ పంపేవారు చందా నంబరు, చందాదారుని పేరు, వివరాలతో చెక్కు కమీషన్ రూ.5లు కలిపి దయచేసి పంపి సహకరించండి.

మేనేజరు, జమీన్‌రైతు, నెల్లూరు 524 001

## సారానే అతడి చరిత్ర రచనకు ఔతుంది సిరా

... తిక్కవరపు సుకుమార్‌రెడ్డి

ఈనాడు
ఆంధ్రదేశమ్మొక
పెద్ద అధికారిక కల్లుపాక,
అదొక అతిపెద్ద సాధికారిక బ్రాందీకొట్టు,
అనధికార సారా కొట్టు
ఇది సారా బాబు చంద్రనిప్పుల పాలన,
ఇది
బ్రాందీ బాబుల భూలోక స్వర్గం
సారా వారొక
మాట మార్చే ఊసరవెల్లి,
గోడ మీద పిల్లి,
హీనచరితుడైన గోడ పైన బల్లి,
భారీ పన్నులతో
ప్రజల రక్తం పీల్చేనల్లి.
అతడొక కత్తి - తేనె పూసిన కత్తి
అతడొక చక్రవర్తి - నయవంచక
చక్రవర్తి
అతడొక వ్యాఘ్రం - గోముఖ వ్యాఘ్రం
అతడొక రాష్ట్ర ప్రధాన పరిపాలకుడు-
నీతి మాలిన పాలకుడు - కాపాలికుడు
జన్మభూమి అంటాడు-
సారాను యేరులై పారిస్తాడు
జన్మనిచ్చిన భూమి తల్లికి
బ్రాందీ పోసి తల కొరివి పెడతాడు
అతడు-
ప్రజాస్వామ్య శ్వేత వస్త్రం
ముసుగులో వున్న రాక్షసుడు
భయంకరుడు, యముడు
ప్రజలు కాచుక్కూర్చున్నారు-
శాసనసభ ఎన్నికల కోసం యెదురు
చూస్తున్నారు-
యముడి భరతం పడ్తారు-
అతడి పంచప్రాణాలైన
రాజ్యాధికారాన్ని లాగేస్తారు-
పుట్టుకతో వచ్చిన ఇంటి పేరు ఏదైనా-
పోయేనాడు సారా అనే ఇంటి పేరుతో
పోయేట్లున్నాడు.
చరిత్రకారులు అతడి చరిత్రను
సారాలో ముంచి వ్రాస్తారు.

# గాలి నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు రామగిరి కంటే మెరుగైన స్థలం - నరసింహులు కొండ!

డా. ఎ. జగదీశ్

ప్రపంచంలో ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలను పీడిస్తున్న ప్రధాన సమస్య చాలినంత విద్యుత్ లభించక పోవడం. ప్రస్తుతం మన దేశంలో విద్యుత్ కొరత దాదాపు 30వేల మెగావాట్లుంది. దేశంలో హైడల్, థర్మల్, న్యూక్లియర్, అసంప్రదాయ ఇంధన వనరులు మొదలైన వాటి నుండి దాదాపు లక్ష మెగావాట్లు ఉత్పత్తి అవుతోంది.

ఇటీవల కాలంలో సంప్రదాయ ఇంధన వనరులకు అనుబంధంగా సంప్రదాయేతర ఇంధనవనరులను పలు దేశాలు ప్రోత్సహిస్తున్నాయి. డెన్మార్క్, ఇటలీ దేశాలు న్యూక్లియర్ ఎనర్జీకి స్వస్తి చెప్పి సంప్రదాయేతర ఇంధన వనరులను ప్రోత్సహిస్తున్నాయి. జర్మనీ 2వేల మెగావాట్ల విద్యుత్‌ను విండ్ ఫార్మ్‌ల ద్వారా వుత్పత్తి చేస్తూ ప్రపంచంలో ప్రథమ స్థానంలో ఉంది. కాలిఫోర్నియాలో 175 మెగావాట్లు; డెన్మార్క్, ఇండియాలలో వెయ్యి మెగావాట్ల విండ్ ఫార్మ్‌లు పనిచేస్తున్నాయి.

మన దేశంలో తమిళనాడు రాష్ట్రంలో 700 మెగావాట్ల విండ్ ఫార్మ్‌లు పనిచేస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లో 54 మెగావాట్లు మాత్రమే ఉండటం గమనించదగిన విషయం.

ఆంధ్రప్రదేశ్‌లో అనంతపూర్ జిల్లాలోని రామగిరి, కడవకల్లు, తల్లిమడుగుల, సింగనమల, విశాఖపట్నం జిల్లాలోని భీమునిపట్నం; నెల్లూరు జిల్లాలోని నరసింహులకొండ; చిత్తూరు జిల్లాలోని కాకులకొండ విండ్‌ఫార్మ్‌లు నెలకొల్పేందుకు అనుకూలమైన ప్రదేశాలుగా నిపుణులు నిర్ణయించారు.

నెల్లూరు జిల్లాలోని నరసింహుల కొండపై 10 మెగావాట్ల విండ్ ఫార్మ్‌లు నెలకొల్పేందుకు వీలుగా రెండు వందల ఎకరాలను సేకరించడానికి 1992 సంవత్సరంలో ప్రతిపాదనలు రూపొందించారు. కాని ఇప్పటి వరకు అవి కార్యరూపం దాల్చక పోవడం శోచనీయం. నరసింహుల కొండవద్ద సంవత్సరంలో సరాసరిన గంటకు 20.3 కిలోమీటర్ల గాలి వేగం ఉన్నట్లు నిర్ధారించ బడింది. అదే రామగిరిలో గాలి వేగం గంటకు 19.5 కిలోమీటర్లు కావడం విశేషం.

నరసింహుల కొండ సమీపంలో ప్రైవేటు భూములలో కూడా విండ్‌ఫార్మ్ నెలకొల్పేందుకు పెక్కు అవకాశాలున్నాయి. ఎత్తుపోయే కొద్దీ గాలివేగం పెరుగుతుంది. దీనిని "పవర్ లాఇండెక్స్" అంటారు. ఈ పవర్ లా ఇండెక్స్ నరసింహుల కొండపై దేశంలో కెల్లా అత్యధికం (0.27) కావడం మరొక విశేషం.

నరసింహుల కొండపైకి రోడ్డు వసతి ఉండటం, దగ్గరలో ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను కలిపేందుకు గ్రిడ్ అందుబాటులో వున్నందువల్ల నరసింహుల కొండ ప్రాంతాన్ని మంచి పవన విద్యుత్ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవకాశాలున్నాయి.

ఒక మెగావాట్ విండ్‌ఫార్మ్ నెలకొల్పేందుకు 4 కోట్ల రూపాయలు ఖర్చవుతుంది. మొదటి సంవత్సరంలోనే నూరు శాతం డిప్రిసియేషన్ , అయిదు సంవత్సరాల పన్ను రాయితీ, వుత్పత్తి చేసిన విద్యుత్‌ను ప్రైవేటు సంస్థలకు సరఫరా చేసుకొనే వీలు వుండటం వల్ల, విండ్‌ఫార్మ్ ్లలో పెట్టిన పెట్టుబడిని ఆరు సంవత్సరాలలో రాబట్ట వచ్చు.

నరసింహుల కొండపై విండ్‌ఫార్మ్ నెలకొల్పేందుకు స్థానిక అధికారులు, అనధికారులు, రాజకీయ నాయకులు కృషి చేయవలసిన అవసరం ఎంతైనా వుంది.

# అనంతసాగరంలో జన్మభూమిని ఎవరూ పట్టించు కోవడమే లేదు!

అనంతసాగరం మండలంలో ఆరో విడత జన్మభూమి కార్యక్రమం పట్ల ప్రజల నుంచి స్పందన రాలేదు. పలు గ్రామాల్లో తమ సమస్యలపై అర్జీ లిమ్మని అధికారులు, ప్రజలను కోరగా, గతంలో ఇచ్చిన వాటిని ఏం చేశారని ప్రజలు ప్రశ్నించారు. ప్రజల ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పలేక వృద్ధాప్య ఫించన్లు నాలుగు పంపిణీ చేసేసి పక్క గ్రామానికి సాగిపోతున్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకొని ఉదయంపూట రెండు గ్రామాలు, సాయంత్రం రెండు గ్రామాలు, చీకటి పడ్డాక మరో గ్రామాన్ని మాత్రమే అధికారులు సందర్శిస్తున్నారు. గ్రామపెద్దలు ఏర్పాటు చేసిన విందుల్లో పాల్గొంటూ `కాకిలెక్కలు' తయారు చేసుకొని సాయంత్రానికి మండల కేంద్రాలకు చేరుతున్నారు. జనాలను ఆకర్షించను కొన్ని గ్రామాల్లో అధికారులు, జన్మభూమి టోపీలను ప్రత్యేకంగా పంచినా ప్రయోజనం లేకుండా పోయింది.

### వెంకటగిరిలో కుక్కలు, కోతుల బెడద

వెంకటగిరిలో పిచ్చి కుక్కలు, కోతుల బెడద ఎక్కువయ్యింది. పిచ్చి కుక్కలు కొన్ని వీధి కుక్కలను కరవడం వల్ల, అవి పిచ్చి కుక్కలుగా మారుతున్నాయి. వీటి నుంచి తప్పించు కొనేందుకు ప్రజలు పలుపాట్లు పడవలసి వస్తున్నది. కోతులు ఇళ్లలో దూరి వస్తువుల నన్నింటినీ ధ్వంసం చేస్తున్నాయి. పంచాయితీ కుక్కలను, కోతులను పట్టించే విషయాన్ని మరచిపోయి చాలా రోజులవడం వల్ల వెంకటగిరియులకు ఈ దుస్థితి దాపురించింది.

### కావలిలో మేడే

కావలిలోని భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో `మేడే' వేడుకలు ఘనంగా జరిగాయి. కలుగోళమ్మ గుడి వద్ద సంఘం అధ్యక్షుడు టి. కృష్ణయ్య పతాకావిష్కరణ చేశారు. అడ్వకేట్ వి.వి. నరసింహాచార్యులు, యునైటెడ్ పార్టీ కార్యదర్శి ఆర్. సుందరరావు, మునిసిపల్ వైస్ ఛైర్మన్ గ్రంధియానాదిశెట్టి, కౌన్సిలర్ ఎస్.ఏ. బార్చి ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. అనంతరం కార్మికులు ప్రదర్శనగా ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి తాము ఎదుర్కొంటున్న సమస్యల విషయమై ఒక వినతిపత్రాన్ని ఆర్డీఓకు అందించారు.

## జిల్లావార్తలు

5వ పేజీ కొరవ

### బాకీ లివ్వలేదని కిడ్నాప్

గూడూరుకు చెందిన నిమ్మకాయల వ్యాపారి తిరుమూరు జనార్ధనరెడ్డిని, ఆయన వ్యాపార భాగస్వామి మల్లు రఘురామిరెడ్డి కిడ్నాప్ చేయించినట్లు పోలీసులు చెప్పారు. రఘురామిరెడ్డికి, జనార్ధనరెడ్డి చెల్లించాల్సిన 9 లక్షలు ఇవ్వక పోవడం వల్ల ఈ పనిచేయించినట్లు తెలిసింది. ఈ కేసులో నిందితులందరినీ సిఐ కంపాప్రసాద్ 4తేదిన అరెస్ట్ చేశారు.

*

## ముఖ్యమంత్రి

5వ పేజీ కొరవ

ఆ స్మగ్లరకు పెద్ద; ఆ ఎమ్మెల్యే ఆసరాతోనే ఆయన రక్తచందనం లారీలను నిరాటంకంగా తరలిస్తున్నారని రాపూరంతా గగ్గోలు వుంది. అటువంటి సంఘ విద్రోహికి ముఖ్యమంత్రి సరసన నిలబడే ఛాన్సు దొరికితే ఫారెస్ట్ అధికారులు, పోలీసు అధికారులు అతడి జోలికి పోవడం సాధ్యమా? ఆ స్మగ్లర్ ప్రతిష్ట పెంచడానికే ఈ కుగ్రామంలో సిఎం కార్యక్రమం పెట్టారన్నది - వినడానికి రోత కల్గించినా, కాదనలేని నిత్యం. చంద్రబాబు నాయుడు అమాయకంగా స్మగ్లర్ల వలలో పడిపోయాడు; అధికారులనూ ఇరకాటంలో పెట్టాడు. పైగా ఆ గ్రామానికి సిమెంట్ రోడ్లు వేయిస్తానని ప్రకటించాడు ముఖ్యమంత్రి; అంటే మట్టి రోడ్డులో స్మగ్లింగ్ లారీలకు ఇబ్బంది లెదురౌతున్నాయన్న జాలితోనా?

దీని తర్వాత ముఖ్యమంత్రి వేపినాపి వెళ్లాలి; తమ స్వగ్రామమైన వేపినాపిలో సిఎంకు అపూర్వ స్వాగతం చెప్పాలని ఘనంగా ఏర్పాట్లు చేసుకొని వుండినాడు శ్రీ పావకన్ను జయచంద్రారెడ్డి - కాని ముఖ్యమంత్రి ఆ ఎండకు, దుమ్ముకు తట్టుకోలేక తన పర్యటన కుదించుకొని అర్ధాంతరంగా హెలికాప్టర్ ఎక్కడంతో ఆయన ఆగ్రహానికి లోనయ్యాడు. ఎమ్మెల్యే ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, మంత్రులు, జిల్లా అధికారులు ఇందుకు బాధ్యులని తన స్వంత భాషలో చీవాట్లు పెట్టారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి శ్రీలక్ష్మి కొత్త కావడంతో, రాపూరు ఎమ్మెల్యే చొరవ తీసుకోక పోవడంతో ముఖ్యమంత్రి పర్యటనకు రోడ్డు సౌకర్యంలేని గ్రామాలు ఎంపిక చేశారు. దీనివల్ల 1 1/2గంట పాటు ఆయన పర్యటన గందరగోళంగా సాగింది. పర్యటనలో మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, పరసారత్నం, ఎమ్మెల్యేలు ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, రమేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీలక్ష్మి, ఎస్పి ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

* * *

## ప్రతిపద్యంలో పరమాత్మతత్త్వం

# తొమ్మిదే పద్యాల్లో కార్తికేయుడికి భక్తి హారతి!

భోగిగా వుండి యోగిగా మారి కార్తికేయుని కీర్తనమే విశుద్ధమైన జ్ఞానమని విశ్వసించి, ఆస్వామిపై కీర్తనలు వ్రాసి గానం చేసిన, పద్నాలుగవ శతాబ్దపు మహాయోగి అరుణగిరి నాథర్ తమిళంలో రచించిన "కందర్ అనుభూతి" పద్య కావ్యాన్ని శ్రీ

---

**గ్రంథసమీక్ష**
శ్రీశ్రీశ్రీ సుబ్రహ్మణ్యానుభూతి
తెనుగు పద్యానువాదం
రాచగుండ్ల చెంచలరావు
సమీక్షకులు గిద్దలూరు గోపాలరావు
ప్రతులకు: 16/33/976, వెంగళరావునగర్,
కావలి - 524 201, నెల్లూరు జిల్లా.
వెల: రూ10/-

---

పొంగూరు సూర్యనారాయణ శర్మ వచన రచనగా తెనిగించారు. దీని ఆధారంగా శ్రీ రాచగుండ్ల చెంచలరావు "శ్రీశ్రీశ్రీ సుబ్రహ్మణ్యానుభూతి" పేరున పద్య కావ్యం రచించారు. ఈ కావ్యంలో కార్తికేయుని ప్రార్థించటం, ఆ మూర్తికి హారతి పట్టటం అనే అంశాలున్నాయి.

పార్వతీ పరమేశ్వరుల పుత్రుడైన కార్తికేయుడ్ని రక్షకుడుగా భావించి ఆ భగవానుడి దివ్య చరిత్రను, మహాత్మ్యాన్ని మహోన్నతంగా స్తుతించారు. ఆ స్తుతి విధానంలో పరబ్రహ్మతత్త్వం ప్రకాశించింది.

జన్మకర్మముల వాయు శరీర యాత్రకు అంతం పలికి, ముక్తికి రాచబాట ఏర్పర్చమని ఏడై ఒక్క పద్యాలలో రచయిత ప్రార్థించారు. ప్రార్థన పూర్తిచేసి మరో తొమ్మిది పద్యాల్లో భగవద్భక్తి తత్త్వాన్ని పొందుపరచి కార్తికేయునికి హారతి పట్టారు.

భక్తి విశ్వాసంతో సాగించిన ఈ అనువాదంలో చెంచలరావు తన పద్యాల్లోని ప్రతి పదంలోను పరమాత్మ తత్త్వాన్ని తెలుగు తియ్యదనంతో అతికారు. తన ప్రబోధాత్మకమైన రచనల ద్వారా ప్రజలకు ఆధ్యాత్మిక నీతి ధర్మాలను బోధించటం జీవితాశయంగా వుంచుకున్న చెంచల రావు ధన్య చరితుడు.

ఇంత వరకు చాలా గ్రంథాలకు ముద్రణ భాగ్యం కలిగించిన సాహిత్యాభిమాని రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ కొండూరు విశ్వనాథాచార్యులు ఈ గ్రంథాన్ని కూడా ముద్రించి తన సాహిత్యాభి మానాన్ని మరొకసారి చాటుకున్నారు.

*

| జమీన్‌రైతు చందా | |
|---|---|
| సంవత్సరచందా | రూ.100లు |
| ఆరు నెలలకు | రూ.50లు |
| విడిప్రతి | రూ.2- |



ఈశ్వర అల్లా చిత్రంలో సౌందర్య

# మీనా సినిమాలు చూసిన ప్రేరణతో మూగమ్మాయిని పెళ్లాడిన వీరాభిమాని!

"సినిమాలలో జరిగినట్లు కొన్ని విషయాలు నిజ జీవితంలో జరిగితే ఎంతైనా ఆశ్చర్యమేస్తుంది," అంటూ నటి మీనా ఒక విషయం చెప్పింది. మైసూరులో ఆమెకొక వీరాభిమాని ఉన్నాడట. క్రమం తప్పకుండా ప్రతివారం వారానికొక ఉత్తరం వ్రాస్తాడట. ఆమె నటించిన సినిమాలు తప్ప మిగతావి చూడడట! ఒక్కోసారి పేజీలకు పేజీలు వ్రాస్తాడట ఉత్తరాలు. ఒక ఉత్తరంలో "నీలాంటి అందమైన అమ్మాయి దొరికితేనే పెళ్లి చేసుకొంటాను, అని రాశాడట". వారం క్రితం అతను అకస్మాత్తుగా మా ఇంటికి వచ్చాడు. ఒంటరిగా కాదు; అతనితో ఒక అమ్మాయినీ తీసుకొచ్చాడు. ఆమె చాలా అందంగా వుంది. ఆమెను తను పెళ్లాడ బోతున్నట్లు చెప్పాడు. 'నీ పేరు ఏమిటమ్మాయ్" అని ఆ యువతినే అడిగాను. జవాబివ్వలేదు. నవ్వు వ్వుతూ ఆ యువకుని వంక చూసింది. అతను "ఈమె మాట్లాడలేదండి - మూగది. మీరు ఒక తమిళ చిత్రంలో మూగపిల్లగా నటించారు. ఆ అమ్మాయి ఎంతో గుణవంతురాలు. ఆ పాత్రకు మీరు జీవం పోశారు. అందుకే ఈ మూగ అమ్మాయిని చేసుకోబోతూ, ముందు మీ ఆశీస్సులు అందుకోవడానికి వచ్చాను," అన్నాడు. నాకు నోట మాటరాలేదు కళ్లు చెమ్మగిల్లాయి. అమాంతంగా నా మెడలోని నెక్లెస్ తీసి, ఆ అమ్మాయి మెడలో వేస్తూ, మనసారా ఆశీర్వదించాను. జీవితంలో ఇలాంటి సంఘటనలను ఎన్నటికి మరువలేము కదా?" అంది మీనా.

## నీలి మేఘాలు

"ద్యూయెట్లు, ఫైట్లు లేని ప్రేమ కథా చిత్రాలు," అన్నారు సురేష్ తుమ్మల. ఈయన దర్శకత్వం వహించే "నీలిమేఘాలు" చిత్రంలో వినీత్, మహేశ్వరి, ఉత్తేజ్, బాబూమోహన్, ఉదయ్, నవీన్, సంజీవి, ఉమాశర్మ, రాగిణి, అరుణ్, లత, తరంగిణి, సుధ, బేబీ నిత్య పాత్రధారులు. మాటలు: పోదిలి శ్రీనివాస్. పాటలు: చంద్రబోస్, సుధీర్, సుమన్, జాపూడి; సంగీతం: దుగ్గిరాల.

## పెళ్లాడి చూపిస్తా

"మే నెలాఖరున రిలీజ్ చేస్తాం," అన్నారు సాయిప్రకాష్. ఈయన దర్శకత్వం వహించే "పెళ్లాడి చూపిస్తా" చిత్రంలో నవీన్‌వడ్డే, రోజా, రవళి, పృధ్వి నటిస్తున్నారు. సంగీతం: మహేష్.

## యువభారతం

"నలుగురు గోల్డ్ మెడలిస్టులు ఉద్యోగాల కోసం ప్రయత్నించి, విసిగి వేసారిపోయి; చివరికి నలుగురూ నాలుగు మార్గాలు ఎన్నుకుంటారు. అలా ఎన్నుకున్న మార్గాల ద్వారా వాళ్లు సంఘానికి ఏ విధంగా సాయపడ్డారన్నది ఈ చిత్రం ఇతివృత్తం. జూన్ నెలాఖరున విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం," అన్నారు ఎం.ఎస్. గోపినాథ్. ఈయన దర్శకత్వం వహించే "యువభారతం చిత్రంలో సురేష్, చంద్రమోహన్, చిన్న, నాగేందర్, లత, లతాశ్రీ, పద్మనాభం, బాబూమోహన్, చిట్టిబాబు, గుండు హనుమంతరావు, నటవర్గం. సంగీతం: జె.వి. రాఘవులు.

తరువాయి 12వ పేజీలో

## షూటింగ్ పూర్తయినా సినిమాకు ఏ పేరు పెట్టాలో తోచలేదట!

"80శాతం షూటింగ్ పూర్తయింది. మంచి టైటిల్ కోసం వెతుకుతున్నాం," అన్నారు పి.ఎన్. రామచందర్. ఈయన దర్శకత్వంలో తెలుగు - కన్నడ భాషల్లో తయారవుతున్న శ్రీవాసవి ప్రొడక్షన్స్ చిత్రంలో తండ్రీ, కొడుకులుగా సుమన్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఒకటి మాఫియా డాన్. మరొకటి సాఫ్ట్ కేరెక్టరు. ప్రకాశ్‌రాజ్ పోలీస్ కానిస్టేబుల్‌గా ఒక ముఖ్యమైన పాత్ర ధరిస్తున్నారు. పునీత్ ఇస్సార్ విలన్. ఇంకా సాక్షి శివానంద్, స్నేహ, వినయప్రసాద్, రాజీ తదితరులు నటిస్తున్నారు. సంగీతం: హంసలేఖ. రెండు పాటలనూ మారిషస్‌లో చిత్రీకరిస్తారట. ఈ మధ్య కన్నడం నుండి తెలుగులోకి డబ్బింగ్ అయ్యే చిత్రాల జోరెక్కువైంది.

# థ్రిల్ కల్గించే ఫైటర్లు ప్రాణాలు పణంగా పెడ్తున్నారు!

హార్స్‌మన్ బాబు చెప్పిన విషయం

"ఎప్పుడూ సినిమా స్టార్‌ల గురించే వ్రాస్తారందరూ; తెరవెనుక కష్టపడే మాలాంటి వాళ్ల గురించి ఒక ముక్కయినా వ్రాయవచ్చు కదా?" అన్న కంఠం వినిపించి పక్కకు తిరిగాను. హార్స్‌మన్‌బాబు నవ్వుతూ కనిపించాడు. నిజమే దాదాపు 200 చిత్రాలకు స్టంట్ మాస్టర్‌గా పనిచేసిన హార్స్‌మన్ బాబు గురించి వ్రాయక తప్పదు. "సైనికదళంలో గుర్రాలకు తర్ఫీదు ఇచ్చేవాడు మా నాన్న; ఆ తర్వాత మద్రాసుకు వచ్చి రేసు గుర్రాలకు, తదనంతరంసినిమా గుర్రాలకు తర్ఫీదు ఇచ్చేవాడు. ఇప్పుడా బాధ్యత నామీద పడింది. ఒకప్పుడు మా ఇంట్లోనూ గుర్రాలుండేవి. చిన్నప్పుడు నేను గోరు ముద్దలు తిన్నది గుర్రాల మీదే. వాటి మీదే నిద్రపోయేవాడ్ని. అప్పట్నుంచి గుర్రాలంటే నాకు ప్రాణం. నాకు పేరు తెచ్చింది గుర్రాలేకాక నా అసిస్టెంట్లు కూడా. వాళ్లు ఒక్కోసారి ప్రాణాలకు తెగించి, చేసే ఫైట్లు ప్రేక్షకుల హర్షధ్వానాలు అందుకుంటాయి. ఇటీవల రాంగోపాల్ వర్మగారి హిందీ చిత్రంలో రైలు నుంచి దూకే సీన్‌లో నా అసిస్టెంట్ విశ్వ బలంగా దెబ్బలు తగిలి, ప్రాణాలు కోల్పోయాడు పాపం. నా మనసు చలించి పోయింది. చాలా కాలం వరకు ఏ షూటింగ్‌లోనూ పాల్గొనలేక పోయాను. నాలా ఇతర స్టంట్ మాస్టర్లు, బాధపడిన సంఘటనలు ఎన్నో ఉంటాయి," అన్నారు హార్స్‌మన్ బాబు.

## అరవిందస్వామి ఆయువు చిట్కా

హీరో అరవిందస్వామి చాలా జాలీ టైప్. ఉల్లాసంగా ఉన్నప్పుడు సిగరెట్‌ల మీద సిగరెట్లు కాల్చేస్తుంటాడు. అది ఎంత హానికరమో అతనికి తెలిసినా ఎందుకు ఆ అలవాటు మానడే! అంచేత, అతనికి హిత బోధ చేయాలనిపించింది. "స్వామీ! మీకు తెలుసో - తెలీదో ఒక సిగరెట్ పీలిస్తే జీవితంలో రెండు నిమిషాల ఆయుర్దాయం తగ్గి పోతుందట," అన్నాను. "సదా సంతోషంగా వుంటే రెండు నిమిషాల ఆయుర్దాయం పెరుగుతుందనీ మీరు వినలేదా?" అన్నారు స్వామి. "అది చాలా మందికి తెలిసిన విషయమే కదా?" అని నేనంటే, "అందుకే నేను సిగరెట్ పీలుస్తున్నప్పుడు నవ్వుతుంటాను. ఆయుర్దాయంలో మార్పేమీ ఉండదుగా?" అన్నాడు అరవింద్ కన్నుగీటుతూ. అసాధ్యుడే!

## ఉషాకిరణ్ మూవీస్ బెంగాలీ చిత్రం

ఈనాడు రామోజీరావు బెంగాలీ భాషలోనూ ఒక చిత్రాన్ని తన సొంత స్టూడియోలో నిర్మిస్తున్నారు. నితీష్‌రాయ్ దర్శకుడు.

## నీ కోసం

"జూన్ 29 నుంచి షూటింగ్," అన్నారు వి. శ్రీనివాస్. ఈయన దర్శకత్వం వహించే "నీకోసం" చిత్రంలో మహేశ్వరి, రవితేజ నాయికా నాయకులు.

* * *

# సాంకేతిక విలువలు అద్భుతం-జీన్స్!

మనిషిలో వున్న "జెనటిక్స్"ను అంటే జన్యుకణాలను ఇంగ్లీషులో "జీన్స్" అంటారు. ఇది వైద్య శాస్త్ర విజ్ఞాన పదం. ఈ జన్యు కణాలు, అంటే జీన్స్‌ను బట్టే మనిషి ఎదుగుదల, రూపురేఖల నిర్మాణం, రక్తబంధంలోని వంశపారంపర్య క్రమపద్ధతి, ప్రవర్తనా సరళిలో క్రమబద్ధత ఏర్పడుతుంటాయట. కవల పిల్లలు జన్మించటం, ఆ కవలలకు మళ్లీ కవలలు జన్మించటం వారిలో ఒకే రకమైన రూపు రేఖలు ఏర్పడటం, ఒక ప్రవర్తనా సరళి కుదరటం జీన్స్ వల్లే జరుగుతాయట. ఈ వైద్య సూత్రాన్ని ఆధారం చేసుకొని ఎ.ఎం. రత్నం - కె. శంకర్ దర్శకత్వంలో "జీన్స్" చిత్రం నిర్మించాడు. ఈ చిత్రానికి సంబంధించిన కథ, స్క్రీన్‌ప్లే కూడా శంకర్ వ్రాశాడు. "జెంటిల్‌మెన్", "ప్రేమికుడు", "భారతీయుడు" చిత్రాలతో తన దర్శకత్వ స్థానాన్ని పటిష్టం చేసుకున్న తమిళ యువదర్శకుడు శంకర్ ఈ చిత్రంతో అంతర్జాతీయ స్థాయి గుర్తింపుకు ఎదిగాడు. దీనికి కారణం ఈ చిత్రం షూటింగ్ అధిక భాగం ప్రపంచంలోని ప్రముఖ దేశాల్లో జరపటం. ఈ చిత్రంలోని ఒక పాటను ప్రపంచంలోని ఏడు గొప్ప వింత నిర్మాణాలున్న చోట్ల జరిపారు. ఇంతెందుకు -వింతలు, వినోదాలు, సుందర సౌరభాలు, అద్భుతాలకు కొలువైన విశ్వగోళాన్ని కెమరా కన్నుతో మహాద్భుతంగా ప్రేక్షకుల కన్నుల ముందుంచారన వచ్చు. అంతేగాక, ఉప్పెనలా ఉబికి ప్రపంచ సినిమా రంగంలో విజయదుందుభి మ్రోగిస్తున్న సాంకేతిక విప్లవానికి, అంతర్జాతీయ విలువలకు ఈ చిత్రంలో హారతి పట్టారు. సాంకేతిక పరంగా చోటు చేసుకున్న గ్రాఫిక్ వర్క్స్, స్పెషల్ ఎఫెక్ట్స్, ట్రిక్‌ఫోటోగ్రఫీ, ఇతర కంప్యూటర్ టెక్నాలజీ ఈ చిత్రానికి హైలెట్. కథ కంటే సాంకేతిక నైపుణ్యమే చిత్రానికి బలం. సాంకేతిక పరమైన ఈ గొప్ప కృషిలో ఫోటోగ్రఫీ, ఎడిటింగ్‌లు కూడా ప్రముఖ స్థానం వహిస్తాయి. ఫోటోగ్రాఫర్ అశోక్‌కుమార్, ట్రిక్ ఫోటో గ్రాఫర్ వెంకట్ ప్రతి ఫ్రేములోనూ చూపిన నైపుణ్యం ప్రశంసనీయం. లెనిన్ ఎడిటింగు చిత్రానికి మంచి ఊపు నిచ్చింది. రత్నం, శివగణేష్‌లు

## చిత్రసమీక్ష

◆ ◆ ◆

గుడ్లూరు గోపాలరావు

వ్రాసిన ఆరుపాటలకు ఎ.ఆర్. రహమాన్ వినతగ్గ సంగీత బాణీలు కుదిర్చాడు. ఇలా అన్ని ప్రత్యేకతలతో, పూర్తి కమర్షియల్ విలువలతో ఈ చిత్రం వైవిధ్యంగా, విచిత్రంగా, వినోదంగా రూపొందింది.

ఒక కథ చెప్పుకోవాలంటే ఇందులో మూడు ముఖ్యమైన పాత్రల మీద ఆరు కవలల పాత్రలు సృష్టించ బడ్డాయి. రెండు కవలల పాత్రలున్న చిత్రం చూస్తేనే కొన్ని సన్నివేశాలలో గందర గోళం గోచరిస్తుంది. ఇక ఆరు కవలల పాత్రలున్న చిత్రంలో ఇంకెంత గందరగోళం వుంటుందో చెప్పాలా? కాని ఈ గందర గోళాన్ని సాంకేతిక విలువలు కప్పి పుచ్చాయి.

అమెరికాలో పెద్దబ్బాయి (నాజర్) ఒక ఇండియన్ హోటలు నడుపుతుంటాడు. అతనికి చిన్నబ్బాయి (నాజర్) అనే తమ్ముడుంటాడు. వీళ్లిద్దరూ కవలలు; ఈ రెండు పాత్రలను నాజర్ పోషించాడు. పెద్దబ్బాయికి విశ్వనాథ, రామమూర్తి అనే ఇద్దరు కవల పిల్లలు కలుగుతారు. ఈ రెండు పాత్రలను ప్రశాంత్ పోషించాడు.

కృష్ణవేణి (లక్ష్మి) అనే ఆవిడ బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ కోసం ఇండియా నుంచి అమెరికా వస్తుంది. ఆమె వెంట మనుమరాలు మధుమిత, (ఐశ్వర్యారాయ్), మనవడు మాధేష్ (రాజు) వస్తారు. వారికి విశ్వనాథ తన ఇంట్లో ఆశ్రయమిస్తాడు. మధుమిత విశ్వనాథను ప్రేమిస్తుంది. విశ్వనాథతో, మధుమిత పెళ్లి జరిపేందుకు పెద్దబ్బాయి ఒక సూచన చేస్తాడు. విశ్వనాథ తమ్ముడు రామమూర్తికి కూడా అదే ముహూర్తానికి పెళ్లి చేస్తే బాగుంటుంది. కాని వీరిద్దరూ కవలలు కాబట్టి వారి భార్యలు కూడా కవలలుగా వుంటే బాగుంటుందని

తరువాయి 12వ పేజీలో

# వారఫలాలు

*తేది 9.5.98 నుండి 15.5.98 వరకు; మీనంలో శుక్రుడు; మేషంలో శని, బుధ, కుజులు మరియు సూర్యుడు 14వరకు; వృషభంలో 15 నుండి సూర్యుడు; సింహంలో రాహువు; కుంభంలో గురు, కేతువులు; కన్య, తుల, వృశ్చిక, ధనుస్సులలో చంద్రుడు.*

### మేషం
(అశ్వని, భరణి, కృత్తిక 1వ పాదం)

పనులు కొద్దిపాటి శ్రమతో అనుకూలిస్తాయి. మిత్రులు, బంధువుల తోడ్పాటు లభిస్తుంది. ఆర్థిక పరిస్థితి బాగుంటుంది. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబ వ్యక్తులకు అనారోగ్యం కలుగవచ్చును. ఉద్యోగులకు పనిభారం, శ్రమ అనిపించదు. శుభ కార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. వారాంతంలో ప్రయాణాల వల్ల నష్టం ఉంటుంది.

### వృషభం
(కృత్తిక. 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2పాదాలు)

ఆర్థికస్థితి, రాబడి తృప్తికరంగా ఉంటుంది, విద్యా, వివాహ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. తలచిన పనులు నెరవేరగలవు. బంధు మిత్రుల రాకపోకలు, కాలక్షేపణ ఉంటుంది. అనుకొనని ఖర్చులు కూడా పైనబడగలవు. వ్యాపార పెట్టుబడులకు మంచి సమయం. ఉద్యోగులకు అధికారుల తోడ్పాటు ఉంటుంది.

### మిధునం
(మృగశిర, 3,4పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు)

ఉద్యోగ వ్యవహారాలలో, కుటుంబ వ్యవహారాలలో మార్పులుంటాయి. వృత్తి, వ్యాపార, వ్యవసాయ రంగాలలో రాబడి బాగా ఉంటుంది. వృత్తి, వ్యాపార పెట్టుబడులకు మంచి సమయం. పనులను అనుకూలంగా నెరవేరినా, తొందర లేకుండా వ్యవహరించండి. వారాంతం నుండి అధికారుల వల్ల చిక్కులు, వత్తిడి పెరుగుతుంది. అనవసర తగాదాలలో ప్రవేశించ వలసి వస్తుంది జాగ్రత్త.

### కర్కాటకం
(పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్రేషలు)

వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. పలుకుబడి కొరకు మొగమాటం కొరకు ఖర్చులు ఉంటాయి. అనుకున్న పనులు అనుకూలంగా నెరవేరగలవు. ఆరోగ్య భావం తృప్తికరంగా ఉంటుంది. చేబదులు, అప్పులు ఇవ్వవలసి రావచ్చును. కోపం తొందరపాటు పెరుగుతుంది. కుటుంబ వ్యక్తుల విద్యా, వివాహ విషయాలు సుముఖంగా ఫలితాన్నిస్తాయి.

### సింహం
(మఖ; పుబ్బ; ఉత్తర 1వ పాదం)

కష్టం మీద పనులు సాధించుకొనాలి. అందుకై డబ్బు వెదజల్ల వలసి వస్తుంది. వృత్తి, వ్యాపార, వ్యవసాయ జీవనం గల వారికి రాబడి బాగా ఉంటుంది. పెట్టుబడులకు మంచివారు తోడై ప్రోత్సహిస్తారు. కుటుంబ సభ్యులతో వారాంతంలో విభేదాలు కలుగవచ్చును. విశ్రాంతి తక్కువ కష్టం ఎక్కువ. స్థానమార్పులు, ప్రయాణాలు, పలువురితో పరిచయాలు పెరుగుతాయి.

### కన్య
(ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త; చిత్త 1,2 పాదాలు)

పనులు అనుకూలమైనట్టుగా కనపడినా వాయిదా పడతాయి. వృత్తి, వ్యాపార, వ్యవసాయ రంగాలలో ఆశించినంత ఆదాయం కనపడదు. తగాదాలు రాకుండా జాగ్రత్త పడండి. ఉద్యోగులు అధికారుల విషయంలో జాగ్రత్తగా ఉండండి. కుటుంబ సభ్యులతో విభేధాలు, విసుగు కలగవచ్చును. శుభ కార్యాలలో పాల్గొనడం, ప్రతి పనిలో టెన్షన్ ఎక్కువ.

### పంచాంగం

10తేది ఆదివారం నృశింహజయంతి.
11తేది సోమవారం నిజ కర్తరి ప్రారంభం. మహా వైశాఖి పర్వదినం.

**ముహూర్తాలు**

తేది 13 బుధవారం ఉదయం 9.12 గంటలకు మిధునలగ్నాన వ్యాపార ప్రారంభ, వివాహాలకు సుముహూర్తాలున్నవి.

**మే తిథులు**

వైశాఖ శుద్ధ

| | | | |
|---|---|---|---|
| తేది 9 | శని | త్రయోదశి | ఉ.గ 3.10వ |
| తేది 10 | ఆది | చతుర్దశి | సా.గ 5.20వ |
| తేది 11 | సోమ | పూర్ణిమ | ఉ.గ 7.00వ |

వైశాఖ బహుళ

| | | | |
|---|---|---|---|
| తేది 12 | మంగళ | పాడ్యమి | రా.గ.8.48వ |
| తేది 13 | బుధ | విదియ | రా.గ. 9.28వ |
| తేది 14 | గురు | తదియ | రా.గ.10.03వ. |
| తేది 15 | శుక్ర | చతుర్థి | రా.గ 10.02వ |

స్వయంపాకుల శ్రీనివాసులు
ఎం.ఎ

### తుల
(చిత్ర 3,4పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు)

ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. చిన్న గాయాలు, వాహన రిపేర్లు కలుగ వచ్చును. వృత్తి, వ్యాపార, వ్యవసాయ రంగాలలో ఆశించినంత ఆదాయం ఉండక పోవచ్చును. ఉద్యోగులు మంచి ప్రయత్నాలు చేసికొని అదనపు బాధ్యతలను తప్పించుకొనండి. శుభకార్య ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

### వృశ్చికం
(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

ఈ రాశి వారికి ఆశించినంతగా ఆదాయం రాదు. పైగా అదనపు ఖర్చులు, వస్తువులు కొనడం జరుగుతుంది. అప్పు చేయవలసి వచ్చినా ఆశ్చర్యం లేదు. ఉద్యోగులకు శ్రమ, బాధ్యతలు పెరుగుతాయి. వ్యాపార, వ్యవసాయాలపై పెట్టుబడులకు తొందరపడవద్దు. ఆస్తులు, కుటుంబ సంబంధమైన సమస్యలు ఏర్పడవచ్చును. వారాంతంలో శుభ వార్తలు వింటారు. శుభ కార్యాలలో పాల్గొనడం, మంచి గౌరవ మర్యాదలు ఉంటాయి.

### ధనుస్సు
(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పాదం)

పనులందు అనుకూలత, ఆర్థికాభివృద్ధి, ఆదాయం పెరుగుదల ఉంటుంది. వారాంతంలో మంచి ఖర్చులు ఉంటాయి. బంధుమిత్రుల రాకపోకలు; ప్రయాణాలు ఉంటాయి. ఆర్థికాభివృద్ధికి అవకాశాలు లభించ వచ్చును. భాగస్వాములతో జాగ్రత్తగా మెలగండి. కేసులు, తగాదాలు రాజీ చేసికొంటే మంచిది. పిల్లల విద్యా, వివాహ ప్రయత్నాలు అనుకూలించ వచ్చు.

### మకరం
(ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1,2 పాదాలు)

ముఖ్యమైన ఆర్థిక సంబంధమైన పనులు అతి కష్టం మీద అనుకూలిస్తాయి. ఈ రాశి వారికి ఆర్థికంగా బాగుంటుంది. రాబడి పెరుగుతుంది. అధికారుల తోడ్పాటు ఉద్యోగులకు ఉంటుంది. శుభ వార్తలు వినడం, శుభ కార్యాలలో పాల్గొనడం, వారం చివర కొత్త వస్తువులు కొనడం జరుగుతుంది. ఆరోగ్యం కాస్త జాగ్రత్తగా చూచుకొనండి. వృత్తి, వ్యాపార విస్తరణ ప్రయత్నాలకు అనుకూలం.

### కుంభం
(ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిష, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు)

వృత్తి, వ్యాపార, వ్యవసాయ జీవనం గలవారికి ఆదాయం బాగుంటుంది. కుటుంబ బాధ్యతలు, ఉద్యోగ బాధ్యతలు ఇబ్బంది పెడతాయి. గట్టిగా శ్రమపడితే పనులందు అనుకూలత ఉంటుంది. వారాంతంలో బాధపెట్టే వార్తలు వినడం, ఆరోగ్యం కొద్దిగా లోపించడం జరుగ వచ్చును. శుభ కార్యాలలో పాల్గొనే ప్రయాణశ్రమ ఉంటుంది. వృత్తి, వ్యాపార, వ్యవసాయాభివృద్ధి ప్రయత్నాలకు అనుకూల సమయం.

### మీనం
(పూర్వాభాద్ర 4 పాదం, ఉత్తరాభాద్ర, రేవతి)

ఆరోగ్యం సరిగా లేకపోయినా, గుండె ధైర్యం, పనులు నిర్వహించగల నేర్పుండి మంచి గౌరవం పొందుతారు. ఉద్యోగులు అధికారుల తోడ్పాటుతో పనులు నిర్వహిస్తారు. వృత్తి, వ్యాపార, వ్యవసాయ రంగాలలో ఆదాయం బాగుంటుంది. బంధుమిత్రులతో కాలక్షేపణ, బాకీలు కొంత వరకు లభించుట, ఇతరులకు సహాయ పడటం జరుగుతుంది.

## జనవాణి

మూడవ పేజీ కొరవ

లాకప్ చావులు, ఎన్‌కౌంటర్లు పోలీసులు చేయరు. పోలీసులకు రౌడీలు, మాఫియా గూండాలు, దోపిడీ దొంగల జోలికి వెళ్లే ధైర్యం లేదు. అమాయకులపై, అబలలపై ఒంటి కాలిమీద లేస్తూ... తమ ప్రతాపాన్ని చూపిస్తుంటారు. పోలీసుల పనితీరుపై ప్రజలలో నూటికిఐదు మందికి కూడా సదభిప్రాయం లేదంటే వ్యవస్థ ఎంత చక్కగా పనిచేస్తున్నదో పాలకులు ఆలోచించాలి. పోలీస్ వ్యవస్థను ప్రక్షాళన చేయడం ప్రభుత్వ బాధ్యత. దీనిలో భాగంగా పోలీస్ జీత, భత్యాలను పెంచాలి. అవినీతికి పాల్పడితే పోలీసులను ఇళ్లకు పంపే విధంగా చట్టాలను రూపకల్పన చేయించాలి. సిఎం చంద్రబాబు నాయుడు ధైర్యంగా ఈ సంస్కరణలకు పూనుకొంటే ప్రజలు సంతోషిస్తారు.

నెల్లూరు — ఎస్. రామచంద్రయ్య

### ముఖ్యమంత్రి తెలివి

కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన నిధులను ముఖ్యమంత్రి జన్మభూమి పథకానికి మళ్లిస్తున్నారు. ఇంప్రూవ్డ్ టూలికిట్స్ టు రూరల్ ఆర్టిజన్ అనే పథకానికి 90 శాతం నిధులను సబ్సిడీ క్రింద కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. 10శాతం మాత్రమే లబ్దిదారుడు భరించాలి. ఆ నిధులను జన్మభూమి పథకానికి వినియోగిస్తున్నారు. కాంట్రాక్టర్లు, టెండర్లతో ప్రమేయం లేదని ప్రకటించిన ముఖ్యమంత్రి వీటిని తెలుగుదేశం కార్యకర్తలకు అప్పజెప్పారు. సిమెంటు రోడ్డు వేస్తే తిరిగి 40 ఏళ్ల వరకు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టనవసరం లేదు. కాని జన్మభూమి కార్యక్రమంలో వేసిన రోడ్లు అప్పుడే అధ్వాన్నంగా తయారయ్యాయి.

నెల్లూరు — బి. భాస్కర్

### రాష్ట్రపతికి అభినందనలు

ప్రపంచ అత్యుత్తమ రాజనీతిజ్ఞుడుగా అవార్డు అందుకొన్న భారత రాష్ట్రపతి కెఆర్. నారాయణన్‌కు అభినందనలు. ఈ పురస్కారం భారత దేశ స్వర్ణోత్సవాలు జరిగే శుభ వేళ ప్రదానం చేయడం భారతీయులందరికీ ఆనంద దాయకం. అవార్డు అందుకొన్న రాష్ట్రపతి మరింత మెరుగైన ఆలోచనలతో మరెన్నో పురస్కారాలు అందుకొని భారతీయుల ప్రతిష్ఠను మరింత పెంచాలి.

నెల్లూరు — జె. పోలిరెడ్డి

### రెండుగా చీలిన సిమెంట్‌రోడ్డు

నెల్లూరు టౌన్‌లో ఈ మధ్య చాలా రోడ్లు సిమెంట్ చేశారు. వాటిలో మారోడ్డు, అంటే చంద్రమౌళి నగర్ ఆరవరోడ్డు కూడా ఒకటి. అది భూకంపం వచ్చి రెండుగా చీలిపోయినట్లు చీలింది. ఎవరైనా అధికార్లు వచ్చి తనిఖీ చేసుకోవచ్చు. దీనిపై చర్య తీసుకొనే దమ్ము ఎవరికైనా వుందా?

నెల్లూరు — శివ

### అమెరికా పర్యటన వ్యాసాలు బాగున్నాయి

"అమెరికాలో నా అనుభవాలంటూ" జమీన్‌రైతు సంపాదకులు డోలేంద్రప్రసాద్ వ్రాసిన వ్యాసాలు చదివాక అక్కడి విషయాలు చాలా తెలిశాయి. సంపాదకులు అమెరికా సమాజంలో ఎంత లోతుగా తొంగి చూసారన్నది ఆ వ్యాసాలు చదివితే అట్టే అర్థమై పోతుంది. అమెరికా భూతల స్వర్గమనుకొనే వారి భ్రమలు ఈ వ్యాసాలతో తొలగి పోయాయి. వేలు ఖర్చు పెట్టి అమెరికా వెళ్లనవసరం లేకుండానే ఆ దేశమంతా తిరిగిచూసిన అనుభూతి సంపాదకుడి వ్యాసాల ద్వారా కలిగింది. అక్కడి భారతీయులు పడేకష్టాలు కళ్లనీళ్లు తెప్పించాయి.

నెల్లూరు — ఆర్. సుబ్బయ్య, బివి. రాధాకృష్ణయ్య

### పారిశుధ్య పరిస్థితి మెరుగు పడదా?

నెల్లూరు పట్టణంలో పారిశుధ్య పరిస్థితి నానాటికీ తీసికట్టు నాగం బొట్లు సామెతను గుర్తుకు తెస్తూంది. మునిసిపల్ పారిశుధ్య సిబ్బంది 600 మందితోపాటు, ప్రైవేటు కాంట్రాక్టర్లకు చెత్త తొలగించే బాధ్యతను అప్పజెప్పారు. కాని ఏ వీధిలో చూచినా చెత్త దర్శన మిస్తూనే ఉంది. మురుగు కాల్వలలో సక్రమంగా నీళ్లు పోక వాటి కడుపు పగిలి, రోడ్లపై ప్రవహిస్తున్నాయి. బృందావనంలోని డాక్టర్ల ఆసుపత్రుల్లోని వ్యర్థ పదార్థాలను నిర్లక్ష్యంగా రోడ్డుపైకి విసరి వేయడం బాధ్యతారాహిత్యం. మునిసిపాలిటితో, ఐఎంఎ సంఘ నాయకులు మాట్లాడి టౌన్ ఆసుపత్రుల్లోని వ్యర్థ పదార్థాలను ఒక ప్రత్యేక ట్రాక్టర్ ద్వారా సేకరించి, ఏరోజు కారోజు తగులబెట్టే ఏర్పాట్లు చేయాలి.

నెల్లూరు — ఎ.ఆర్.శాస్త్రి

### స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యాలయాన్ని మార్చాలి

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయాన్ని నెల్లూరు టౌన్‌కు 10 కిలోమీటర్ల దూరంగా మార్చడం అన్యాయం. ఈ కార్యాలయంతో స్త్రీలకు ఎక్కువగా పనులుంటాయి. ఇటువంటి కార్యాలయాన్ని టౌన్ మధ్యలో ఉంచితే అందరికీ ఉపయోగం. బస్సు సౌకర్యం లేని ప్రాంతానికి మహిళలు పనిమీద వెళ్లాలంటే కనీసం 15 రూపాయలు ఖర్చు పెట్టాలి. జిల్లా కలెక్టర్ శ్రద్ధ తీసుకొని ఈ కార్యాలయాన్ని టౌన్ మధ్యలోనికి మార్చాలి.

నెల్లూరు — పందిళ్లపల్లి అరుణమ్మ

## యాభై ఏళ్ల క్రితం

మూడవ పేజీ కొరవ

గూడూరు యోధులు అనేకులు విపరీతంగా యితర దేశాలు తిరిగి వచ్చియున్నారు - దేశంలో పరదేశం వెళ్లివచ్చిన వారి సంఖ్యలో మెజారిటీ మన గూడూరుకే వుంటుంది - యుద్ధము అయిపోయాక మరల ప్రయాణాలు బలమయ్యాయి - పొన్నలూరు కోటారెడ్డి - చేవెట్టి కృష్ణయ్యగారలు జపానుకు వెళ్లియున్నారు. మారంరెడ్డి రమణారెడ్డి గారు గూడ జపానుకు వెళ్లుటకు టికెట్ పొంది యున్నారు.

వీరు గాకుండా యంగిండియా మైకాప్రొడ్యూస్ యిలాకా పొన్నవోలు దశరథరామిరెడ్డి - వరిదిరెడ్డి దశరథరామిరెడ్డి గారలు మైకా వ్యాపారం మీద లండన్ వెళ్లబోతున్నారు. చాకలివాడు గుడ్డలు వేయడమే తడవు - యింకెంత మంది బయలుదేర బోతున్నారో!

### స్టూడియో వార్తలు

చిరకాలం నుంచి తమ చిత్రకళా నైపుణ్యం ద్వారా మనకు పరిచితులైన యస్. బ్రహ్మగారి ఆధ్వర్యాన కొత్త కంపెనీ ఒకటి పుట్టింది - డైరెక్టరు బ్రహ్మగారే - కవి మహాకాలి బలరామయ్య - కథకుడు మధుకర్ - అందరూ యువకులూ, కొత్తవారే - నక్షత్రాలను గూడ కొత్తవారినే యేరుకుంటారట - మొత్తానికి సాహసమైన త్రొక్కు.

కంపెనీ పేరు ప్రవీణ. తీయబోయే ఫిలిం పేరు 'ప్రాప్తం' ఇందులో యెవరెవరి ప్రాప్తం యెలా గుంటుందో చూడాలి మరి!

### గవర్నర్ జనరల్ రాజాజీ

భారత గవర్నర్ జనరల్‌గా ప్రథమ భారతీయుడు శ్రీ చక్రవర్తి రాజగోపాలాచారి గారు నియమింపబడ్డారు.

### నెల్లూరుముచ్చట్లు

**సభలు**

2తేది కళ్‌వాలా సతీమణి సభను గూర్చి:- ఆమె మటుకు గొప్ప ఆరిటరుగాక రెడ్డిగారు గూడ దొప్పయగుత కాని ఇచట సేవ కానంతయును లేదు విశ్వదాభి వేమ! వినరరామ.

**డాక్టర్ల సభను గూర్చి**

ప్రతినిధులా, ఆరు వదులకంటె లేదు ఆరు వేల ఖర్చులాయ బాత కాని మనకు వైద్య ఘనతకు చోటేది విశ్వదాభివేమ! వినరరామ.

* * *

**జమీన్‌రైతు చందా**

| | |
|---|---|
| సంవత్సరచందా | రూ.100లు |
| ఆరు నెలలకు | రూ.50లు |
| విడిప్రతి | రూ.2- |

## కొత్తవూపిరి

1వ పేజీ తరువాత

ఇప్పటి పరిస్థితి వేరు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం పట్ల ప్రజా వ్యతిరేకత వెల్లువుతు తున్నది. మొన్నటి పార్లమెంట్ ఎన్నికలలోనే దాని సూచనలు ప్రతిఫలించాయి. పిసిసికి సమర్థుడైన నేత వుండి వుంటే ఆ ఎన్నికలలో తెలుగుదేశం అభ్యర్థులు ఐదారుచోట్లకు మించి గెల్చి వుండేవారు కారన్నది కాంగ్రెస్ వాదుల అభిప్రాయం అది నిజం కూడా! పిసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌కు సామాన్య ప్రజలతో సంపర్కం లేదు. రాష్ట్ర నాయకులతో సాన్నిహిత్యం లేదు. చొరవ తక్కువ. కార్యకర్తలలో ఉత్సాహం, ఉత్తేజం కల్గించే సమర్థత లేదు. అందువల్లనే మొన్నటి ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులు అనాథల వలె అవస్థ పడ్డారు. పురాతనమైన వ్యవస్థీకృతమైన ఒక మహా గొప్ప రాజకీయ సంస్థ ప్రతినిధుల వలె కాక - తమ వ్యక్తిగత బలంతో, స్వంత వనరులతో పోరాడవలసి వచ్చింది.

ఈ లోపం పూరించడమే ఇప్పుడు రాజశేఖరరెడ్డి చేయవలసిన పని. అందుకు ఆయన అన్ని విధాల అర్హుడు. ఎన్‌టిఆర్‌పై జరిపించిన రాజకీయ పోరాట ఉద్యమాలు; తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా జరిపిన అసమ్మతి ఆందోళనలు రాజశేఖరరెడ్డికి ప్రజలలో ఒక గుర్తింపు తెచ్చి పెట్టాయి. రాష్ట్రంలో ఎక్కడ ఏ కాంగ్రెస్ కార్యకర్తకు అన్యాయం జరిగినా తనకు తెలిస్తే సిరికిన్ చెప్పడన్నట్లు వచ్చి వాలిపోతాడన్న ఇమేజ్ వుంది. అందువల్ల ఆయన చేతికి పిసిసి పగ్గాలు చిక్కడం - సాధారణ కాంగ్రెస్ కార్యకర్తకు సంతోషం కల్గించే పరిణామం.

ఇప్పటి వరకు ఏ ప్రాముఖ్యం కల్గిన పదవినీ నిర్వహించిన వాడు కాడు కాబట్టి - ఆయనపై అవినీతి ఆరోపణలు లేవు. యాభైఏళ్ల వయస్సు సమీపించిన రాష్ట్ర అగ్రనేతలలో యువకుడుగానే పరిగణింపబడుతున్నాడు. అదొక అదనపు అర్హత.

రాజశేఖరరెడ్డి అదృష్టం - ఆయనపై అగ్రనేతలందరిలోనూ అసంతృప్తి, ఆగ్రహం, అలుక, అనుమానాలు ఎన్ని వున్నప్పటికి ఇప్పటి పిసిసి పెత్తనం విషయంలో మాత్రం అందరూ మనఃపూర్తిగా సహకరించారు. కోట్ల విజయభాస్కరరెడ్డి, నేదురుమల్లి జనార్ధనరెడ్డిలిరువురూ ఆయన నియామకం పట్ల సంతోషం వెలిబుచ్చారు. రాష్ట్ర రాజకీయాలలో కలకమైన వ్యక్తుల సహకారం పొందగల్గడం అదృష్టం.

ఎన్నికల ముందు పిసిసి అధ్యక్షత అంటే - ఎన్నికలలో గెలవడమంటూ జరిగితే ముఖ్యమంత్రిత్వానికి సహజమైన అభ్యర్థిగా గుర్తింపు పొందుతారు. అది తెలిసీ రాజశేఖరరెడ్డిని ఆ ఇద్దరు అగ్రనేతలు. పిసిసి నేతగా ఆమోదించడం విశేషం. ముఖ్యమంత్రిత్వమనేది రాజశేఖరరెడ్డికి చిరకాల స్వప్నం. 1989- 94ల మధ్య కాలంలో ఎంత ప్రయత్నం చేశాడో - రాజశేఖరరెడ్డి - ముఖ్యమంత్రిత్వం కోసం ఆ ప్రాంతంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రులపై నిత్యం అసమ్మతి ప్రకటించే న్యూసెన్స్ వ్యక్తిగా నిందలూ భరించాడు. ఆ తర్వాత పివి హయాంలో కేంద్ర మంత్రిత్వమూ ఆయనకు అందని మానిపండు అయ్యింది. ఎంత ఓపిక పట్టినా, ఎన్నివిధాలుగా మెప్పించడానికి ప్రయత్నించినా పివి మనసు కరగలేదు.

ప్రజలలో, కార్యకర్తలలో పలుకుబడి వుండి కూడా తన రాజకీయ జీవితం వృథా అయిపోతున్నదని ఆవేదన చెందేవాడు రాజశేఖరరెడ్డి. తన ఉద్రేక స్వభావం, పత్రికల వాళ్లు ఎదురు పడితే ఎవరో ఒకర్ని తిట్టాలన్పించే నోటిదురద, నిత్య అసమ్మతి వీరుడిగా నింద తన రాజకీయ భవితవ్యానికి అడ్డంకులు కల్పిస్తున్నాయన్న జ్ఞానోదయం ఆయనకు చాలా లేట్‌గా కల్గింది. దానితో ఇటీవల కాలంలో చాలా నిగ్రహంతో వ్యవహరించడం నేర్చుకున్నారు. ఆ ఓర్పు ఇప్పుడు ఫలించింది; సోనియాగాంధీ కరుణించింది.

తన సమర్థతను, నైపుణ్యాన్ని, కార్యదక్షతను నిరూపించుకొనే అవకాశం లభించింది. అదృష్టవశాత్తు ఇప్పట్లో కాంగ్రెస్ వర్గాల నుంచి పెద్ద న్యూసెన్స్ ఎదురుకాదు. పిసిసి అధ్యక్షుడుగా ఆయన కెదురయ్యే మొదటి సవాల్ - ప్రభుత్వ యంత్రాంగాన్నంతటినీ పార్టీ రాజకీయాలతో కలుషితం చేసి, గ్రామస్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలను నిర్వీర్యం చేసేస్తున్న చంద్రబాబు ప్రతి ప్రభుత్వ పనిలోనూ తెలుగుదేశం ఎమ్మెల్యేలను, స్థానిక నాయకులను ఇన్వాల్వ్ చేసేయడం వల్ల తెలుగుదేశంతో విబేధించే వారెవ్వరూ బ్రతకలేని పరిస్థితి కల్పించాడు చంద్రబాబు. దానితో కాంగ్రెస్ కార్యకర్తలు కకావికలై పోతున్నారు వారందరిలో ధైర్యం కల్పించి, ఉత్సాహపరచి, వ్యవస్థీకృతం చేయడానికి ఎంతో కష్టపడవలసి వుంటుంది - పిసిసి అధ్యక్షుడు. కష్టం ఆయనకు లెక్కలోనిది కాకపోయినా జిల్లా స్థాయిలో వివిధ వర్గాల నాయకులను సమన్వయం చేసి, అందర్నీ ఒక త్రాటిమీద నడిపించడం మాత్రం పెద్ద సర్కస్ ఫీట్ క్రిందే లెక్క.

ఇంకొక ప్రక్క నెల రోజులలో జరుగనున్న ఉప ఎన్నికలు వైఎస్ ప్రతిష్ఠకు పరీక్ష కాబోతున్నాయి. చంద్రబాబు నాయుడు ఉప ఎన్నికల ఫలితాలను తనకనుకూలంగా మల్చుకోవడంలో ఘనాపాటి. నందిని పంది, పందిని నందిగా మార్చి ఎన్నికల్లో గెల్చి పోతుంటారాయన. చంద్రబాబులోని నైపుణ్యం రాజశేఖరరెడ్డికి గత పార్లమెంట్ ఎన్నికల్లో ప్రత్యక్ష అనుభవమే. కడపలోనే వూపిరాడకుండా చేశాడు. దీన్ని ప్రతిఘటించి, కాంగ్రెస్ అభ్యర్థులను గెల్పించ గల్గితే రాజశేఖరరెడ్డి ప్రతిష్ఠ అమాంతం పెరిగి పోతుంది. ఆ వూపు - రేపటి అసెంబ్లీ ఎన్నికల వరకు వుపయోగపడుతుంది.

ఎన్నికల సంగతి ఎటుపోయినా, రాజకీయ శత్రువులపై ఒంటికాలితో దూకే తత్వం వుంది రాజశేఖరరెడ్డిలో; చంద్రబాబును ఆయన ఆ స్పీడులోనే ఎదుర్కోబోతారు. రేపటి నుంచి రాష్ట్ర రాజకీయం వీరిద్దరి రాజకీయ ఎత్తుగడలతో రణరంగం కాబోతుంది. *

## మైపాడు

2వ పేజీ తరువాత

వారితో కుమ్మక్కు అయ్యారనే భావించాలి. ఫలితంగా సరైన ప్రచారం లేకుండానే వేలం పాటకు తేదీని నిర్ణయించారు. వేలం జరిగే దగ్గర పరిసర గ్రామాల రైతులెవరూ చేరకుండా జాగ్రత్త పడ్డారు. అప్పటికీ కొందరు రైతులు వేలానికి సిద్ధపడి మూడెకరాల భాగాన్ని ఎకరా లక్షా పదివేల రూపాయల వరకు పాట పెంచారట. తెలుగు నాయకులు దాన్ని సహించలేక పోయారు. ఆ రైతులను బెదరించి, భయపెట్టి, తర్వాత పాటలో పాల్గొనకుండా తరిమేశారు. అప్పటి నుంచి వారిదే ఇష్టా రాజ్యమై పోయింది. లక్షకు తక్కువ కాకుండా విలువచేసే భూమిని పాతికవేలకు, ముప్ఫయ్ వేలకు పాట తెంచేశారు. ముప్పాతిక కోటి రూపాయల ఆస్తి ఇరవై లక్షలకే వారి స్వంతమైపోయింది.

ఇందుకూరుపేట రూరల్ బ్యాంక్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, సర్వేపల్లి సూపర్ ఎమ్మెల్యేగా చలామణి అవుతున్న కమలాకరరెడ్డి ఈ గోల్మాల్ తతంగం జరిపించారట. పోటీలో వారే ప్రత్యక్షంగా పాల్గొన్నట్లున్నారు.

ఏమిటీ దుర్మార్గం? దేవుడి సొత్తును పచ్చ చొక్కాల దళం ఇంత పబ్లిక్‌గా దోచుకుపోతుంటే అడిగేవాడు, అడ్డుకునే వాడు లేడా? ఎంత అధికార పార్టీ అయితే మాత్రం ఇంత ప్రజాద్రోహమా?

కలెక్టర్ గారూ - ఇది క్షమించరాని దుర్మార్గం, దోపిడీ! తక్షణం ఈ వేలం పాటపై దర్యాప్తు జరిపించండి; అవసరమైతే మరింత విస్తృత ప్రచారంతో మరోసారి వేలం నిర్వహించడం మంచిది. దేవాదాయ అధికారులు ఈ తెలుగు బందిపోట్లతో పూర్తిగా కలిసిపోయి, దేవుణ్ని దగా చేశారు. ఏ దర్యాప్తు అయినా వారి ద్వారా జరిపిస్తే దండగే! ఎవరైనా ఉన్నతాధికారుల చేత విచారణ జరిపించడం సమంజసం! *



నవయుగం దశరథరామయ్య కుమారుడు రామోజీరావు, స్వర్ణలతల పెండ్లి 29.4.98 తేది నెల్లూరు క్లాత్ మర్చెంట్స్ అసోసియేషన్ హాల్‌లో జరిగింది.

**WANTED**

10 HP Lister type oil engines with 6" Pumps in good running condition. Phone. 327354

**King Among Cements**



**Priya Cement**

A Quality Product of PRIYADARSHINI CEMENT LIMITED

# సినిమా

9వ పేజీ తరువాయి

## నీమొగుడే నామొగుడు

తాళ్ళపాక రమేషొడ్డి సమర్పణలో పై చిత్రం షూటింగ్ మే నెలలో మొదలవుతుంది. తెలుగు, కన్నడ భాషల్లో తయారయ్యే ఈ చిత్రానికి రచన: స్వామిజీ. సంగీతం: వినాయకరావు.

## మరపురాని సంఘటన

"ముంబాయిలో నేను చదివే కాలేజీ వార్షికోత్సవంలో జరిగిన ఒక సంఘటనను ఎప్పటికీ మరచిపోలేను," అంటూ సిమ్రాన్ ఇలా చెప్పింది. "ఎందుకు ఆ కార్యక్రమానికి `సోపబాక్స్' అని పేరు పెట్టారోగాని, ఆ పోటీ ఏమిటంటే - స్టేజీ మీద ఉపన్యసించే వారి చేతికి ఒక బాడ్మింటన్ బాట్ ఇస్తారు. ప్రేక్షకులు విసిరే టమోటోలను, కుళ్ళిన గ్రుడ్లను ఆ చేతితో అడ్డుకుంటూ నిర్విరామంగా ప్రసంగించిన వారికి బహుమతి ఇస్తారు. నేను `కాలేజ్ బాయ్స్' అనే విషయం మీద అనర్గళంగానే మాట్లాడాను. నా స్పీచ్ ఎంత గంభీరంగా సాగిందంటే ఏ ఒక్కరూ నా మీదకు టొమోటోనో, గ్రుడ్డునో విసిరేయలేదు. అందరూ చెవులప్పగించి, అలాగే వింటూండి పోయారు. చివరికి ఏం చేయడానికి తోచక వాళ్లమీద వాళ్లే టొమోటాలను విసురుకున్నారు. బహుమతి మాత్రం ఆ నాక ఇంకా తెలియాడుతూనే ఉంటుంది!

## చిలిపి రాగాలు

కమలహాసన్, రీనా రాయ్ నటించిన "సనమ్‌తేరీ కసమ్" హిందీ చిత్రం తెలుగులో "చిలిపి రాగాలు"గా డబ్బింగ్ అయింది. రచన: జొ. మూర్తి, సంగీతం: ఆర్.డి. బర్మన్. దర్శకత్వం: ఆర్. నరేంద్రబేడి.

## మహిళ

"సగటు మహిళ స్థితిగతులు నేడు ఏ విధంగా ఉన్నాయి అనే అంశాన్ని తీసుకుని, హీరోయిన్ ఓరియింటెడ్ చిత్రంగా కన్నడంలో "దేవసాగరి" అనే చిత్రం తయారైంది. దాని డబ్బింగ్ "మహిళ" అన్నారు రాజేంద్ర సింగ్ బాబు. ఈయన దర్శకత్వం వహించిన "మహిళ" చిత్రంలో సౌందర్య, శశికుమార్, గిరీష్ తదితరులు నటించారు. మాటలు, పాటలు: వెన్నెలకంటి. సంగీతం: వి. మనోహర్.

## పెళ్లి వారమండీ

"ఒక అనాథ యువకుణ్ని ఆరుగురు స్త్రీలు, ఆరుగురు పురుషులు ఎలా ఆదరించి, అభిమానిస్తారో కొత్త కోణంలో తెలియజెప్పే చిత్రం," అన్నారు వీరూ. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో తయారయ్యే "పెళ్లి వారమండీ" చిత్రం దాసరి అరుణకుమార్, సాక్షి శివానంద్, కోట శ్రీనివాసరావు ప్రఖ్యాత నటవర్గం. మాటలు; మరుధూరి రాజా.

## కలవారి చెల్లెలు కనకమాలక్ష్మి

"అన్నా చెల్లెలి మధ్య అనురాగానికి, ఆప్యాయతలకు అద్దం పట్టే చిత్రం. చెల్లెల్ని ఎన్నో పరీక్షలు పెట్టి బావను (సురేష్)ను కట్టబెట్టాడు సాయికుమార్. ఇతని చెల్లెలు రాశి. భార్య ఇంద్రజ," అన్నారు ఎ. మోహనగాంధీ. ఈయన దర్శకత్వం వహించే "కలవారి చెల్లెలు కనకమాలక్ష్మి" చిత్రంలో ఆలీ, ఎవిఎస్., భరణి, సివిఎల్. మల్లికార్జునరావు, లక్ష్మీశెట్టి, భద్రం, వై. విజయ పాత్రధారులు. రచన: జనార్దనమహర్షి.

# నేదురుమల్లి

4వ పేజీ తరువాయి

నమ్మాలా? సమాజంలో కొన్ని వర్గాలకు వ్యతిరేకులైన ఈ పార్టీ నాయకులు ఏ విధంగా సక్రమ పాలన చేస్తారని ఎద్దేవా చేశారాయన. బిజెపికి రహస్య అజెండా ఒకటుందని, చంద్రబాబు బిజెపికి మద్దతు ఇవ్వకుంటే ఆ పార్టీ ఎమ్మెల్యేలే బిజెపిలో చేరేవారని జనార్ధన రెడ్డి చెప్పారు. మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్ధన రెడ్డి, ప్రకాశరావు, కెవి సుబ్బారెడ్డి, నేదురుమల్లి పద్మనాభ రెడ్డి, మాజీ ఎమ్పీ గౌస్ మొహియుద్దీన్, దేవకుమార్ రెడ్డి, ఆనం జయకుమార్ రెడ్డి, బివి లక్ష్మి, పందిళ్లపల్లి అరుణమ్మ తదితరులు వేదికపై ఆసీనులయ్యారు. సభ అయ్యాక చురుకుగా సాగుతున్న ఇందిరాభవన్ రెండో అంతస్తు నిర్మాణపు పనులను నేదురుమల్లి సమీక్షించారు.

# నెల్లూరుసంగతులు

4వ పేజీ తరువాయి

14,500 మంది దరఖాస్తు చేయగా, మెరిట్, రిజర్వేషన్లు పరిశీలించి 402 మందిని ఇంటర్వ్యూలకు పిలిచినట్లు చెప్పారు. 18 తేది పురుష, 19 తేది స్త్రీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. కండక్టర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరించే సమయంలోనే గందరగోళం రేగింది. ఇంటర్వ్యూలు ఏ విధంగా పూర్తి చేస్తారో?

## విష్ణు సహస్రనామ పారాయణం

భరద్వాజ ఆశ్రమ సేవా సంఘం విష్ణు సహస్రనామ పారాయణ మహా యజ్ఞాన్ని 22తేది రంగనాయకులపేటలోని మహాలక్ష్మమ్మ దేవస్థానంలో నిర్వహించింది. సురభి సుబ్రహ్మణ్యం, జెబిఎన్. అప్పేశ్వరశాస్త్రి ఋత్విక్కులుగా ఓంకార నాదంతో ప్రారంభించి నిత్యజపగీత, లక్ష్మీఅష్టోత్తర విష్ణుసహస్రనామం, హనుమాన్ చాలీసా, సుందరకాండ భాగాల సామూహిక పారాయణాలు జరిపించారు.

## ఇన్సూరెన్స్ కొత్త పథకాలు

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ కొత్తగా మార్గబంధు, నాదలహరి, క్రెడికేర్ పథకాలను ప్రవేశపెట్టినట్లు సీనియర్ డివిజనల్ మేనేజర్ డివిఎల్ఎన్. శాస్త్రి చెప్పారు. మార్గబంధు పథకం ఒక గ్రూపుగా విహారయాత్రలకు వెళ్లే విద్యార్థులు, యాత్రికులకు అనువర్తిస్తుందన్నారు. నాదలహరి స్కీమ్ కళాకారులకు అండగా నిలుస్తుందన్నారు. క్రెడికేర్ పథకం అంగవైకల్యంతో పుట్టే బిడ్డలకు వరప్రసాదినిగా నిలుస్తుందని వివరించారు. కంపెనీలో వున్న పథకాలను ప్రజలు వినియోగించుకొంటే నిశ్చింతగా జీవితం కొనసాగించ వచ్చన్నారు.

## వికలాంగులకు వృత్తి విద్యాశిక్షణ

శారీరక వికలాంగులకు స్వచ్ఛంద సంస్థ ప్రగతి ఛారిటీస్ వృత్తి విద్యా శిక్షణ ఇస్తుంది. కాళ్లు పూర్తిగా లేనివారు, కాళ్లు పనిచేయని వారు టిబి హాస్పిటల్ వద్దగల తమ కార్యాలయంలో సంప్రదించవలని వి. శ్రీనివాసులు కోరుతున్నారు.


## చిత్రసమీక్ష

9వ పేజీ తరువాయి

సూచిస్తారు. ఆ సూచనకు సరితూగేట్లు మధుమిత తల్లి కృష్ణవేణి ఒక పన్నాగం అబద్ధమాడు తుంది. మధుమితకు వైష్ణవి అనే చెల్లెలుందని, వీరిద్దరూ కవలలని మధుమిత ను విశ్వనాథకు; వైష్ణవిని, రామమూర్తికిచ్చి వివాహం జరిపించ మంటుంది. మధుమితను, వైష్ణవిని స్వయంగా చూడాలంటారు పెద్దబ్బాయి. అప్పుడు మాథేష్ కంప్యూటర్ టెక్నిక్‌తో, అసలే లేని వైష్ణవిని మధుమితకు కవలగా మధుమితతో కలిసి నృత్యం చేస్తున్నట్లు చూపుతాడు. చివరన అసలు వైష్ణవి లేదని తేలటం. కేవలం మధుమిత వివాహం విశ్వనాథతో జరిపేందుకు అలా చెప్పటం జరిగిందనటం, కథను సుఖాంతం చెయ్యటం జరుగుతుంది.

కంప్యూటర్ టెక్నాలజీ వాడుకొని చూపిన దృశ్యాలన్నీ చిత్రాన్ని రసవత్తరంగా నడిపాయి. చిత్రాన్ని చూడాలన్న మోజు కలిగిస్తాయి. ప్రశాంత్, నాజర్లు కవలల పాత్రలను అద్భుతంగా పోషించారు. మాజీ విశ్వ సుందరి ఐశ్వర్యారాయ్, మధుమిత పాత్రకంటే వైష్ణవి పాత్రను అద్భుతంగా పోషించింది. తన సొగసులతో సోయగాలతో శృంగార సన్నివేశాలను జత గలిపి కన్నుల విందు చేసింది. మిగతా వారంతా బాగానే నటించారు. అందరూ వింతగా, వినోదంగా చూడతగ్గ సాంకేతిక చిత్రమిది. *


# శ్రద్ధాంజలి



మా అభివృద్ధికి కారకులు

## చింతం కృష్ణారెడ్డి గారు

29.4.1998 తేది బుధవారం స్వర్గస్తులైనారు.
వారి ఆత్మకు చిరశాంతిని కలుగజేయమని
భగవంతుని ప్రార్థిస్తూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

**పెద్దకర్మ**

9.5.1998 తేది శనివారం, నెల్లూరు భక్తవత్సల నగర్‌లోని
మా స్వగృహమున జరుగును.
బంధుమిత్రులు తెలియ గోరుతాము.

భార్య: **ఈశ్వరమ్మ** కుమారుడు: **చింతం బ్రహ్మారెడ్డి**

కుమార్తె - అల్లుడు: **రమాదేవి - చెంచురెడ్డి**

సోదరుడు: **చింతం గోవిందరెడ్డి**

అక్క - చెల్లెలు: **కొల్లి ఈశ్వరమ్మ - గడ్డం పాపమ్మ**

**మరియు కుటుంబ సభ్యులు**


Edited, Printed and Published by N. Dolendra Prasad at Zaminryot Press, Offset Printing at Aruna Graphics, Nellore